PCW తెలుగు దినపత్రిక
PCW News Broadcasting PVT Ltd
Published from Hyderabad, circulated to:Hyderabad, Nalgonda, Khammam, Rangareddy, Sangareddy, Warangal, Mbnr, Kurnool, Kadapa, Amaravathi,Krishna
హైదరాబాద్ సంపుటి : 03 సంచిక - 09 ఎడిటర్: నయీంపాషా పేజీలు - 08 రూ - 03/- మంగళవారం 06 జనవరి 2026

## మాతృభాషే మన శ్వాస కావాలి




## ప్రజావాణి వినతులను త్వరితగతిన పరిష్కరించాలి




● వ్యవసాయ రంగానికి కూడా సోలార్ విద్యుత్ వినియోగం ● పీఎం సూర్య ఘర్ పథకానికి ప్రజల్లో స్పందన అంతంత మాత్రమే ● మండలిలో డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క వెల్లడి



### రాష్ట్రంలో విస్తృతంగా అందుబాటులోకి

# సోలార్ పవర్

**హైదరాబాద్,జనవరి 05 (పిసిడబ్ల్యూ న్యూస్):**రాష్ట్రంలో సోలార్ పవర్‌ను విస్తృతంగా అందుబాటులోకి తీసుకు రావాలన్న దిశగా ప్రభుత్వం ఆలోచన చేస్తోందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. గృహ అవసరాలకే కాకుండా వ్యవసాయ రంగానికి కూడా సోలార్ విద్యుత్ వినియోగాన్ని ప్రోత్సహించాలన్న లక్ష్యంతో పలు ప్రణాళికలు రూపొందిస్తున్నామని తెలిపారు. శాసన మండలిలో ఈ అంశంపై మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పీఎం సూర్య ఘర్ పథకానికి ప్రజల నుంచి అనుకున్నంత స్థాయిలో స్పందన రావడం లేదని భట్టి విక్రమార్క పేర్కొన్నారు. రాష్ట్రంలో ఇప్పటికే ఉచిత విద్యుత్ అందిస్తున్న నేపథ్యంలో సోలార్ ప్యానెల్స్ కోసం ఇంటి మీద రూఫ్ ఏర్పాటు చేయాల్సి రావడం కూడా ప్రజలు వెనకడుగు వేయడానికి కారణమవుతోందని చెప్పారు. పీఎం కుసుమ్ పథకాన్ని మరింత ప్రభావవంతంగా అమలు చేయాలనే ఉద్దేశంతో కొడంగల్, బొనకల్ మండలాల్లో పైలట్ ప్రాజెక్ట్‌గా సోలార్ కార్యక్రమాన్ని అమలు చేస్తున్నామని భట్టి విక్రమార్క వెల్లడించారు. ఈ ప్రాజెక్టుకు కేంద్ర ప్రభుత్వం నుంచి కొంత సబ్సిడీ అందుతుందని, మొత్తం పథకం వ్యయం సుమారు రూ.519 కోట్ల రూపాయలు ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమానికి రెడ్కో నోడల్ ఏజెన్సీగా పనిచేస్తోందన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో 52 లక్షల కుటుంబాలకు మిగతా2లో...

### ప్రధాని మోడీతో

# యోగి భేటీ

### - యూపీ రాజకీయాలపైనే ఇరునేతల చర్చలు?



**న్యూఢిల్లీ,జనవరి 05 (పిసిడబ్ల్యూ న్యూస్)::** ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ని ఆయన నివాసంలో సోమవారంనాడు కలుసుకున్నారు. ప్రధానంగా యూపి రాజకీయాలపైనే వీరిద్దరు చర్చించినట్లు తెలుస్తోంది. ఉత్తరప్రదేశ్ మంత్రివర్గ విస్తరణ, 2027లో జరుగనున్న యూపీ అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించిన అంశాలపై ఈ సమావేశంలో ఇరువురు చర్చించారు. ఉత్తరప్రదేశ్ అభివృద్ధి ప్రణాళికలు, రాబోయే ఎన్నికల్లో అనుసరించాల్సిన రాజకీయ వ్యూహాలపై కూడా ఉభయ నేతలు చర్చించినట్టు తెలుస్తోంది. బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డాను కూడా యోగి ఆదిత్యనాథ్ కలుసుకుంటారు. ఉత్తరప్రదేశ్‌లో మంత్రివర్గ విస్తరణ జరుగునుందనే ఊహాగానాలు బలంగా వినిపిస్తున్న నేపథ్యంలో యోగి ఆదిత్యనాథ్ ఢిల్లీలో పర్యటించడం ప్రాధాన్యత సంతరించుకుంది. ఉత్తరప్రదేశ్ బీజేపీ నూతన అధ్యక్షుడిగా పంకజ్ చౌదరిని ఇటీవల ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మిగతా2లో...

## అమెరికా దాడితో 40 మంది పౌరుల మృతి

విద్యుత్ వ్యవస్థ దెబ్బ తినడంతో పలుచోట్ల అంధకారం

వెనెజువెలా అధికార వర్గాలు వెల్లడి




## ఐనవోలు బ్రహ్మోత్సవాలకు సిఎంకు ఆహ్వానం



**హైదరాబాద్,జనవరి 05(పిసిడబ్ల్యూ న్యూస్):**ఐనవోలు మల్లికార్జున స్వామి వారి బ్రహ్మోత్సవాలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఆహ్వానం పలికారు. సిఎంను సోమవారం కలిసిన మంత్రు లు కొండా సురేఖ, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిలు ఆహ్వానపత్రం అందచేశారు. ఐనవోలు పూజారులు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఆశీర్వచనం అందించారు.



## దేవుడిని కూడా వదలకపోవడం దారుణం

### - శబరిమల బంగారం మాయం కేసులో సుప్రీం వ్యాఖ్య

**న్యూఢిల్లీ,జనవరి 05 (పిసిడబ్ల్యూ న్యూస్):** శబరిమల బంగారం తాపడాల కేసులో సోమవారం సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. దేవుడినీ వదిలిపెట్టలేదంటూ ట్రావెన్‌కోర్ దేవస్వమ్ బోర్డు మాజీ సభ్యుడు శంకర్‌దాస్ పిటిషన్‌ను మిగతా2లో...

### కవిత వ్యాఖ్యల ఆధారంగా

# చర్యలు తీసుకోవాలి

### రేవంత్ రెడ్డికి బిజెపి అధ్యక్షుడి సూచన

### పార్టీ పెట్టాలనుకోవడం ఆమె వ్యక్తిగతం అని వ్యాఖ్య



**హైదరాబాద్,జనవరి 05 (పిసిడబ్ల్యూ న్యూస్):** తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత పార్టీ స్థాపించే అంశం ఆమె వ్యక్తిగతమని టీ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు తెలిపారు. సోమవారం హైదరాబాద్‌లో బీజేపీ అధ్యక్షుడు రాంచందర్ రావు మాట్లాడుతూ.. రాజకీయ పార్టీ పెట్టే స్వేచ్ఛ అందరికీ ఉంటుందని పేర్కొన్నారు. బీఆర్ఎస్, హరీష్‌రావు, కేటీఆర్‌పై కవిత ఆరోపణల ఆధారంగా ఎందుకు చర్యలు తీసుకోవట్లేదంటూ సీఎం రేవంత్ రెడ్డిని ఆయన సూటిగా ప్రశ్నించారు. అందుకు మిగతా2లో...



## కవిత పార్టీ.. తెలంగాణ జాగృతి

### మీడియా సమావేశంలో ప్రకటన


**హైదరాబాద్,జనవరి 05 (పిసిడబ్ల్యూ న్యూస్):** ఎమ్మెల్సీ కవిత కొత్త పార్టీ పెట్టబోతున్నారా? అంటే అవుననే సమాధానం చెప్పారు కవిత. సోమవారం నాడు శాసనమండలి నుంచి బయటకు వచ్చిన తరువాత గన్‌పార్క్ వద్ద మీడియాతో మాట్లాడారు కవిత.

మిగతా2లో...

## పోలవరం- నల్లమల్ల సాగర్

# ప్రాజెక్టులను వ్యతిరేకిస్తున్నాం

● ఇంటర్ స్టేట్ రూల్స్‌కు వ్యతిరేకమని జీఆర్ఎంబీకి లేఖ రాశాం ● మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వెల్లడి



**హైదరాబాద్,జనవరి 05 (పిసిడబ్ల్యూ న్యూస్):** పోలవరం- నల్లమల్ల సాగర్ ప్రాజెక్టులను తాము అన్ని ఫోరమ్‌లలో వ్యతిరేకిస్తున్నామని తెలంగాణ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. మాజీ మంత్రి హరీశ్‌రావు చూపిస్తున్న లేఖ ఈ ప్రాజెక్టులకు సంబంధించినది కాదని క్లారిటీ ఇచ్చారు. పోలవరం- నల్లమల్ల ఇంటర్ స్టేట్ రూల్స్‌కు వ్యతిరేకమని జీఆర్ఎంబీకి తామే లేఖ రాశామని ప్రస్తావించారు. తమ అభిప్రాయాన్ని జీఆర్ఎంబీ కూడా సమర్థించిందని గుర్తుచేశారు. సోమవారం అసెంబ్లీ మీడియా పాయింట్‌లో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడారు. పోలవరం- నల్లమల్ల ప్రాజెక్టును మహారాష్ట్ర, కర్ణాటక కూడా వ్యతిరేకిస్తున్నాయని తెలిపారు. సుప్రీంకోర్టులో తెలంగాణ వాదనలను బలంగా వినిపించాలని న్యాయవాది అభిషేక్ సింఘ్వికి సూచించామని పేర్కొన్నారు. ఈ కేసును మిగతా2లో...

### మహిళా సాధికారితకు

# పెద్దపీట

- మహిళల ఆర్థిక స్వావలంబన కోసం కృషి
- ఉచిత బస్సుతో మహిళలకు దక్కిన భరోసా
- ప్రతి మహిళను సభ్యురాలుగా చేర్చాలన్నదే లక్ష్యం
- ఇందిరమ్మ క్యాంటీన్ల కోసం వడ్డీలేని రుణాలు
- అసెంబ్లీ ప్రశ్నోత్తరాల్లో సీతక్క సమాధానం



**హైదరాబాద్,జనవరి 05 (పిసిడబ్ల్యూ న్యూస్):**మహిళా సాధికారతకు సంక్షేమానికి తమ ప్రభుత్వం పెద్ద పీట వేస్తోందని మంత్రి సీతక్క స్పష్టం చేశారు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 48 గంటల్లోనే ఉచిత బస్సు ప్రయాణాన్ని ప్రారంభించామని తెలిపారు. ఇందిరా మహిళా శక్తి కార్యక్రమం ద్వారా మహిళల ఆర్థిక స్వావలంబన కోసం కృషి చేస్తున్నామన్నారు. మహిళా సాధికారత, సంక్షేమమే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి మహిళల అభివృద్ధికి మిగతా2లో...

## ఫోన్ ట్యాపింగ్ కేసులో హరీష్ రావుకు ఊరట



**న్యూఢిల్లీ,జనవరి 05 (పిసిడబ్ల్యూ న్యూస్):** ఫోన్ ట్యాపింగ్ కేసులో బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీష్ రావుకు సుప్రీం కోర్టులో భారీ ఊరట లభించింది. ఈ కేసుకు సంబంధించి తెలంగాణ ప్రభుత్వం దాఖలు చేసిన ఎస్ఎల్పీని సుప్రీం ధర్మాసనం డిస్మిస్ చేసింది. ఫోన్ ట్యాపింగ్ కేసులో హరీష్ రావును విచారించేందుకు అనుమతి ఇవ్వాలంటూ సుప్రీం కోర్టులో తెలంగాణ సర్కార్ పిటిషన్ దాఖలు చేసింది.

మిగతా2లో...

## పోలవరం- నల్లమల్ల సాగర్ ప్రాజెక్టులను వ్యతిరేకిస్తున్నాం

(మొదటి పేజీ తరువాయి)

వచ్చే సోమవారానికి సుప్రీంకోర్టు వాయిదా వేసిందని తెలిపారు. రిట్ పిటిషన్‌లో కాదని.. సూట్ పిటిషన్‌లో రావాలని తమకు సుప్రీంకోర్టు సూచించిందని అన్నారు. ఈ కేసులో స్టే ఇవ్వాలని సుప్రీంకోర్టును వచ్చే సోమవారం కోరుతామని తెలిపారు. వచ్చే విచారణకు తాను కూడా ప్రత్యక్ష్యంగా హాజరవుతానని స్పష్టం చేశారు. ఒకటి, రెండు రోజుల్లో మరోసారి న్యాయ వాదులతో సమావేశం అవుతామని వెల్లడిం చారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాకే రాయలసీమ ఎత్తిపోతల పథకం నిలిపివేశారని స్పష్టం చేశారు. గతంలో ఈ పథకం ఆగిపోయి ఉంటే బీఆర్ఎస్ ఎందుకు చెప్పలేదని ప్రశ్నల వర్షం కురిపించారు. తమ ఒత్తిడి వల్లే ఏపీ ప్రభుత్వం రాయలసీమ ఎత్తిపోతల పథకం పనులు ఆపేసిందని తేల్చిచెప్పారు. బీఆర్ఎస్ హయాంలో కృష్ణ- గోదావరి జలాల్లో తెలివి ఎక్కువ.. పని తక్కువ అని చెప్పుకొ చ్చారు. అతి తెలివితో బీఆర్ఎస్ తెలంగాణకు భారీ నష్టం చేసిందని ధ్వజమెత్తారు. కేసీఆర్ హయాంలో పాలమూరు- రంగారెడ్డిని జూరాల నుంచి శ్రీశైలానికి మార్చి, తుమ్మిడిహెట్టి నుంచి మేడిగడ్డకు కాళేశ్వరాన్ని మార్చి భారీ నష్టం చేశారని మంత్రి ఉత్తమ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

## రాష్ట్రంలో విస్తృతంగా అందుబాటులోకి సోలార్ పవర్

(మొదటి పేజీ తరువాయి)

ఉచిత విద్యుత్ అందిస్తున్నామని, అదేవిధంగా 20 లక్షల విద్యుత్ కనెక్షన్లను పీఎం సూర్య ఘర్ పథకంతో అనుసంధానం చేయాలనే అంశంపై కేంద్ర ప్రభుత్వాన్ని కలిసి చర్చించామని తెలిపారు. స్వయం సహాయక సంఘాలకు పొలాల్లో సోలార్ యూనిట్లు ఏర్పాటు చేసుకునేందుకు అవకాశం ఉన్నప్పటికీ, లీజు భూముల్లో ఈ సదుపాయం కల్పించలేమని కేంద్ర నిబంధనలు స్పష్టం చేస్తున్నాయని డిప్యూటీ సీఎం భట్టి చెప్పారు. ఈ కారణంగా రైతులు కూడా పీఎం కుసుమ్ పథకంపై పెద్దగా ఆసక్తి చూపించడం లేదన్నారు. అయినప్పటికీ సాధ్యమైనంత వరకు ఈ పథకాలను అమలు చేసి సోలార్ విద్యుత్ వినియోగాన్ని పెంచేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోందని చెప్పారు. ఈ అంశాన్ని కేంద్ర ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లేందుకు బీజేపీ సభ్యులు సహకరించాలని కోరారు. 'ట్రాన్స్ ఫార్మర్స్, వ్యవసాయ పంపు సెట్ల కోసం రైతులు దరఖాస్తు చేసుకున్నారు. 3,48,462 మంది దరఖాస్తు చేసుకున్నారు. 75 పైచిలుకు ట్రాన్స్ ఫార్మర్స్ మంజూరు చేశాం. విద్యుత్ శాఖలో చాలా సంస్కరణలు తీసుకు వచ్చాము. 1912 కు ఫోన్ చేస్తే ఎలక్ట్రికల్ అంబులెన్స్ ద్వారా ఫిర్యాదు చేసిన ప్రాంతానికి వెళ్లి సమస్య పరిష్కారం చేస్తారు. అడిగిన వారికి ట్రాన్స్ ఫార్మర్స్ ఇస్తున్నాం. గత కొంతకాలంగా విద్యుత్ శాఖలో ప్రజా బాట నిర్వహించి సమస్యలు పరిష్కరిస్తున్నాం. గత ఏడాది 56807 బూటఇ పరిధిలో కొత్త కనెక్షన్లు, ఎన్పిడీసీఎల్లో 41 086 కనెక్షన్లు.. మొత్తంగా 97893 కొత్త కనెక్షన్లు ఇచ్చాము. ఈ ఏడాదిలో మరో 20 వేల కొత్త కనెక్షన్లు ఇస్తాం. రాష్ట్రంలో ట్రాన్స్ ఫార్మర్స్ కొరత లేదు' అని డిప్యూటీ సీఎం చెప్పారు.

## మహిళా సాధికారితకు పెద్దపీట

(మొదటి పేజీ తరువాయి)

పెద్దపీట వేస్తూ కీలక నిర్ణయాలు తీసుకుంటున్నామని తెలిపారు. తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు నాలుగవ రోజు ప్రారంభమయ్యాయి. సభ మొదలైన వెంటనే స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ప్రశ్నోత్తరాలను చేపట్టారు. ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్ ఏర్పాటుపై సభ్యులు ప్రశ్న లేవనెత్తగా.. మంత్రి సీతక్క సమాధానం ఇచ్చారు. ప్రతి మహిళ ఎస్‌జీహెచ్ సభ్యురాలుగా ఉండాలన్నదే తమ ప్రభుత్వ సంకల్పమని వెల్లడించారు. 15 సంవత్సరాలు దాటిన బాలికల నుంచి పండు ముదుసలి వరకు మహిళా సంఘం సభ్యులుగా చేర్చుతున్నామని తెలిపారు. కిశోర బాలికలు, వృద్ధులు, దివ్యాంగులకు ప్రత్యేక మహిళా స్వయం సహాయక సంఘాలను ఏర్పాటు చేస్తున్నామని మంత్రి సీతక్క పేర్కొన్నారు. రాష్ట్రంలో ఇప్పటి వరకు 250 ఇందిరమ్మ క్యాంటీన్లు ఏర్పాటు చేశామని తెలంగాణ మంత్రి సీతక్క తెలిపారు. క్యాంటీన్ల నిర్వహణ, పెట్టుబడి కోసం స్వయం సహాయక సంఘాల సభ్యులకు వడ్డీలేని రుణాలు ఇస్తున్నట్లు చెప్పారు. స్వయం సహాయక సంఘాల సభ్యులకు 10 రోజులపాటు హైదరాబాద్‌లో శిక్షణ ఇచ్చామన్నారు. పట్టణ ప్రాంతాల్లో 130 క్యాంటీన్లు చేసినట్లు వివరించారు. కోటిమంది మహిళలను కోటీశ్వరులను చేయాలనేది సీఎం రేవంత్‌రెడ్డి సంకల్పమని చెప్పారు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 48 గంటల్లోనే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యాన్ని అమలు చేశామని మంత్రి సీతక్క గుర్తు చేశారు. ఇది మహిళలకు భద్రతతో పాటు ఆర్థికంగా ఉపశమనాన్ని కలిగించే కీలక నిర్ణయమని పేర్కొన్నారు. మహిళల రోజువారీ జీవనాన్ని సులభతరం చేయడమే లక్ష్యంగా ఈ పథకాన్ని ప్రవేశపెట్టినట్లు తెలిపారు. ఇందిరా మహిళా శక్తి కార్యక్రమం ద్వారా మహిళల ఆర్థిక స్వావలంబన కోసం ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని మంత్రి సీతక్క చెప్పారు. మహిళలు స్వయం ఉపాధి సాధించేందుకు అవసరమైన అవకాశాలు, వనరులు కల్పిస్తూ వారి ఆర్థిక బలాన్ని పెంచడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని వివరించారు. 15 సంవత్సరాలు దాటిన బాలికల నుంచి వృద్ధ మహిళల వరకు అందరినీ మహిళా సంఘాల్లో సభ్యులుగా చేర్చుతున్నామని తెలిపారు. ఈ విధంగా మహిళలందరినీ ఒక వ్యవస్థలోకి తీసుకువచ్చి అభివృద్ధి పథంలో నడిపించడమే లక్ష్యమన్నారు. అదేవిధంగా కిశోర బాలికలు, వృద్ధులు, దివ్యాంగ మహిళల కోసం ప్రత్యేక మహిళా స్వయం సహాయక సంఘాలను ఏర్పాటు చేస్తున్నామని మంత్రి వెల్లడించారు. వీరి అవసరాలకు అనుగుణంగా ప్రత్యేక కార్యక్రమాలు రూపొందించి.. వారికి ఆర్థిక, సామాజిక భద్రత కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. అయితే సోమవారం కూడా బీఆర్ఎస్ సభకు దూరంగా ఉండాలని నిర్ణయించింది. శాసనసభ, శాసనమండలి సమావేశాలకు హాజరుకావొద్దని బీఆర్ఎస్ నిర్ణయం తీసుకుంది. సభలో ప్రతిపక్షానికి మాట్లాడే అవకాశం ఇవ్వటంలేదని.. అందుకు నిరసనగా బీఆర్ఎస్ అసెంబ్లీని బహిష్కరించిన విషయం తెలిసిందే.

## అమెరికా దాడితో 40మంది పౌరుల మృతి

**వాషింగ్టన్,జనవరి 05 (పిసిడబ్ల్యూ న్యూస్):** వెనెజువెలాపై అమెరికా సైన్యం చేసిన దాడిలో కనీసం 40 మంది ప్రాణాలు కోల్పోయినట్లుగా వెనెజువెలాకు చెందిన ఓ సీనియర్ అధికారి వెల్లడించారు. మృతుల్లో సైనికులతో పాటు సాధారణ పౌరులు కూడా ఉన్నారని చెప్పారు. వెనెజువెలాపై భారీ దాడి అనంతరం అధ్యక్షుడు నికోలస్ మదురో, ఆయన సతీమణి సిలియా ఫ్లోరెస్‌ను అదుపులోకి తీసుకున్నట్లుగా పేర్కొన్నారు. కాగా, వెనెజువెలాపై చేసిన దాడిలో తమవైపు ఎలాంటి ప్రాణనష్టం సంభవించలేదని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వెల్లడించారు. కేవలం కొద్దిమంది మాత్రమే గాయపడ్డారని తెలిపారు. ఇది అత్యంత సంక్లిష్టమైన ఆపరేషన్ అని పేర్కొన్నారు. మనవైపు ప్రాణనష్టం లేకుండా ఇంత పెద్ద ఆపరేషన్ పూర్తి కావడం ఆశ్చర్యకరమని వ్యాఖ్యానించారు. ఈ దాడిలో అనేక విమానాలు, హెలికాప్టర్లు, ఫైటర్ జెట్లు పాల్గొన్నాయని వెల్లడించారు. సాధారణంగా చొరబడలేని ప్రాంతాల్లోకి ప్రవేశించి, ఈ క్లిష్టమైన ఆపరేషన్ నిర్వహించామని చెప్పారు. వెనెజువెలా ప్రజలకు స్వేచ్ఛ కల్పించడమే అమెరికా లక్ష్యమని ట్రంప్ స్పష్టం చేశారు.వెనెజువెలా దేశంపై దాడి చేసి అధ్యక్షుడు నికొలస్ మదురో, అతని భార్య సిలియా ఎ÷-లోరస్‌ను అగ్రరాజ్యం అమెరికా బందీగా పట్టుకుని న్యూయార్క్ నగరానికి తీసుకుపోయిన క్రమంలో ఆ దేశ రాజధాని కారకాస్, పొరుగున ఉన్న నగరాల్లో తీవ్ర భయం, ఆందోళన పరిస్థితులు నెలకొన్నాయి. ఆహారం కోసం పెద్దయెత్తున ప్రజలు బారులు తీరారు. పలు చోట్ల అంధకారం అలముకుంది. ప్రజా రవాణా వ్యవస్థ స్తంభించింది. ఏ క్షణంలో ఏం జరుగుతుందో అన్న భయంతో చాలామంది ఇండ్లకే పరిమితమై పోయారు. చాలా సూపర్‌మార్కెట్లు మూతపడ్డాయి. తెరిచి ఉంచిన చిన్నచిన్న దుకాణాల వద్ద 500-600 మంది బారులు తీరారు. ముఖ్యంగా ముందు జాగ్రత్తగా బ్రెడ్ దుకాణాల వద్ద జనం పెద్దయెత్తున చేరుకున్నారు. అలాగే మందుల షాపుల వద్ద కూడా ప్రజలు ఎక్కువగా కన్పించారు. ఔషధాలతో పాటు అక్కడ అమ్మే కేన్డ్ ఫుడ్‌ను వారు కొనుగోలు చేయడం కన్పించింది. ప్రజలు తమ ఫోన్లు, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాల చార్జింగ్ కోసం ఎగబడ్డారు. కాగా, అక్కడ స్వల్ప సంఖ్యలో ఉన్న భారతీయ కమ్యూనిటీ కోసం భారత ఎంబసీ ఒక వాట్సాప్ గ్రూప్‌ను సృష్టించింది. దాని ద్వారా భారతీయులకు ఎప్పటికప్పుడు సూచనలు, ఆదేశాలు అందజేస్తున్నది. మెరికా దాడుల్లో పవర్ గ్రిడ్స్ దెబ్బ తినడంతో పలు ప్రాంతాల్లో విద్యుత్తు లేక అంధకారం అలముకుంది.

# మాతృభాషే మన శ్వాస కావాలి

### అమ్మ భాషను మరచిపోవడం సరికాదు

### తెలుగు మహాసభల్లో వెంకయ్యనాయుడు

**గుంటూరు,జనవరి 05 (పిసిడబ్ల్యూ న్యూస్):** తెలుగు భాష సజీవంగా ఉంచేందుకు ఎంతో మంది కృషి చేశారని మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు కొనియాడారు. మనమంతా తెలుగువారమై ఉండికూడా తెలుగు మాట్లాడక పోవడం సరికాదన్నారు. తెలుగు అమ్మ భాషని అన్నారు. గుంటూరులో మూడో తెలుగు మహాసభల్లో ఆయన పాల్గొన్నారు. గొప్పవారంతా తమ మాతృభాషలో చదువుకొనే ఉన్నత స్థానాలకు చేరుకున్నారని వెంకయ్యనాయుడు తెలిపారు. రామాయణ కాలంలోనూ తెలుగు భాష ఉందని ఇటీవల కొన్ని ఆధారాలను గుర్తించారని మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు అన్నారు. 'నన్నయ్య, తిక్కన్న, వేమన, కందుకూరి వీరేశలింగం, గురజాడ అప్పారావు, గిడుగు రామ్మూర్తి, ఉన్నవ లక్ష్మీనారాయణ, సురవరం ప్రతాపరెడ్డి, ఎన్టీ రామారావు, రామోజీరావు.. ఇలా చాలా మంది మహనీయులు తెలుగు భాష ఉన్నతి కోసం శ్రమించారు. తెలుగువారు అయ్యుండి తెలుగు మాట్లాడకపోతే ఏదో లోపం ఉన్నట్లే లెక్క. అమ్మ అంటే



అంతరాళం నుంచి వస్తుంది. అదే మమ్మీ అంటే నోటి నుంచి మాత్రమే వస్తుంది. మాతృభూమిని, మాతృదేశాన్ని, మాతృమూర్తిని మరచినవారు పరిపూర్ణ మానవుడు కాదు. ఈతరంలో తెలుగు భాష నేర్చుకోవాల్సిన అవసరం లేదని తల్లిదండ్రులు భావిస్తున్నారు. గుడి, బడి, అమ్మ ఒడిలో మాతృభాషనే మాట్లాడాలన్నారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధాని నరేంద్ర మోదీ కూడా మాతృభాషలోనే చదువుకున్నారు. మాతృభాషను మరిచిపోతే శ్వాస పోయినట్టే. తెలుగు భాషను కాపాడుకోవాలంటే తెలుగులో మాట్లాడితే చాలు. తెలుగు భాషాభిమానులు, కవులు, రచయితలు, కళాకారులు చేసిన త్యాగాన్ని గుర్తించాలి. ఇతర దేశాల్లో సాంకేతిక విద్య, ఇతర విద్యా కోర్సులు వారి మాతృభాషలోనే ఉంటున్నాయి. మన దేశంలోనూ ప్రధాని మోదీ మాతృభాషలోనే సాంకేతిక కోర్సులు అందుబాటులోకి తీసుకురానున్నారు. స్థానిక ప్రభుత్వాలు కూడా మాతృభాషలోనే ఉత్తర్వులు ఇవ్వాలి. తెలుగు రాష్ట్రాల్లో పరిపాలనా భాషగా తెలుగు అమలు చేయాలి. న్యాయస్థానాల్లో తెలుగు భాషను అమలు చేస్తే చాలా బాగుంటుందని వెంకయ్య నాయుడు తెలిపారు.

## ప్రధాని మోడీతో యోగి భేటీ

(మొదటి పేజీ తరువాయి)

దీంతో రాష్ట్ర మంత్రిమండలి విస్తరణ, సంస్థాగత మార్పులు అనేవి ప్రస్తుతం పార్టీ ఎజెండాలో ఉన్నాయి. జనవరి 14-15లో మకర సంక్రాతి పర్వదినం పూర్తి కాగానే మంత్రివర్గ విస్తరణ జరిగే అవకాశాలున్నాయి. దీంతో పాటు కమిషన్లు, బోర్డులు, కౌన్సిల్స్‌కు కూడా రాజకీయ నియామకాల పక్రియ త్వరలో చేపడతారు. ఇటీవల కాలంలో బీజేపీలో పలు ఆసక్తికర మార్పులు చోటుచేసుకున్నాయి. బీజేపీ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నితిన్ నబిన్‌ను ఇటీవల ఎన్నుకోవడం అందరికీ ఆశ్చర్యం కలిగించింది. ఉత్తరప్రదేశ్‌లో బీజేపీ అధ్యక్షుడిగా పంకజ్ చౌదరిని ఎన్నుకున్నారు. ఆ పదవికి పంకజ్ చౌదరి ఒక్కరే నామినేషన్ వేశారు. దీనికితోడు పలువురు బీజేపీ బ్రాహ్మణ ఎమ్మెల్యేలు లక్నోలో కొద్దిరోజుల క్రితం పీఎన్ పాథక్ నివాసంలో సమావేశం కావడం ఆసక్తికరమైంది. కమ్యూనిటీ ఫీస్ట్ (సహభోజ్) కోసం 40 మంది ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ఈ సమావేశంలో పాల్గొన్నారు. కాగా, గత డిసెంబర్ 30న యోగి ఆదిత్యనాథ్ లక్నో నివాసంలో బీజేపీ కోర్ కమిటీ సమావేశమైంది. మంత్రివర్గంలో ఎవరిని తీసుకోవాలనే దానిపై సమావేశంలో చర్చ జరిగింది. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పంకజ్ చౌదరి ఈ సమావేశంలో పాల్గొన్నారు. అనంతరం ఆయన ఢిల్లీలోని పార్టీ అగ్రనాయకత్వంతో మాట్లాడారు. యూపీ ప్రభుత్వంలో ప్రస్తుతం ముఖ్యమంత్రితో కలిపి 54 మంది మంత్రులున్నారు. గరిష్టంగా 60 మందిని మంత్రివర్గంలో తీసుకోవచ్చు. 2027 అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఇదే చివరి మంత్రివర్గ విస్తరణ కావచ్చని చెబుతున్నారు.

## దేవుడిని కూడా వదలకపోవడం దారుణం

(మొదటి పేజీ తరువాయి)

కొట్టివేసింది. కనీసం దేవుడు, ఆలయం జోలికివెళ్లకుండా ఉండాల్సిందని ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ కేసులో శంకర్‌దాస్ కూడా బాధ్యులేనని పేర్కొంది. ప్రముఖ శబరిమల ఆలయంలో బంగారం అదృశ్యం వ్యవహారంపై దర్యాప్తు జరుగుతోంది. 2019లో బంగారం పూత పూసిన రాగి రేకులను ఎలక్ట్రో ప్లేటింగ్ కోసం స్మార్ట్ క్రియేషన్స్ సంస్థకు అప్పగించారని కేరళ హైకోర్టుకు సిట్ వెల్లడించింది. ఆ ప్లేట్ల మొత్తం బరువు 42.100 కేజీలు కాగా ఎలక్ట్రోప్లేట్రింగ్ పక్రియ పూర్తయిన తర్వాత వాటిపై ఉండే బంగారంలో కొంత అదృశ్యమైంది. ఈ కేసులో ప్రధాన నిందితుడు ఉన్నికృష్ణన్ పొట్టి దానిని ప్రైవేటుగా మళ్లించాడని ఆరోపించింది. ఎలక్ట్రోప్లేట్రింగ్ అనంతరం ఉన్నికృష్ణన్ తనకు 474.90 గ్రాముల బంగారం ఇచ్చాడని గోవర్ధన్ అనే మరో నిందితుడు తెలియజేసి ఆమేరకు సిట్‌కు ఇప్పటికే బంగారం అప్పగించాడు.ఈ కేసు విచారణలో భాగంగా గతంలో బోర్డు మాజీ సభ్యుడు శంకర్‌దాస్‌పై కేరళ హైకోర్టు తీవ్రవ్యాఖ్యలు చేసింది. నేరపూరిత కుట్ర ఆరోపణల నుంచి తప్పించుకోలేరని మండిపడింది. హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వుల్లో తనకు వ్యతిరేకంగా ఉన్న తీవ్ర వ్యాఖ్యలను తొలగించాలని కోరుతూ తాజాగా అతడు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. అయితే న్యాయస్థానం ఆ పిటిషన్‌ను తోసిపుచ్చింది. ఇక ఈ కేసులో దర్యాప్తు పూర్తిచేయడానికి సిట్‌కు కేరళ హైకోర్టు మరో ఆరువారాల గడువు ఇచ్చింది. జనవరి 19న ప్రత్యేక దర్యాప్తు బృందం మధ్యంతర నివేదికను న్యాయస్థానానికి సమర్పించనుంది.

## కవిత పార్టీ..తెలంగాణ జాగృతి

(మొదటి పేజీ తరువాయి)

కొత్త పార్టీ పెట్టబోతున్నట్లు ప్రకటించారు. తన నేతృత్వంలో నడుస్తున్న జాగృతి సంస్థనే కొత్త పార్టీగా అవతరించనుందని కవిత ప్రకటించారు. రాజకీయంగా అందరూ మద్దతు ఇవ్వండని విజ్ఞప్తి చేశారు. త్వరలోనే పార్టీ విధివిధానాలను ప్రకటిస్తానన్నారు. ఇంటి పార్టీ నుంచి అవమాన భారంతో బయటకు వస్తున్నానని.. గొప్ప రాజకీయ శక్తిగా ఎదుగుతామన్నారు. సమస్యలపై పోరాడుతామన్నారు. రాజకీయాల్లో మార్పు తెచ్చే వేదికగా జాగృతి అవతరిస్తుందన్నారు కవిత. అంతకుముందు శాసనమండలిలో మాట్లాడిన కవిత కన్నీటిపర్యంతం అయ్యారు. ఇదే తన చివరి ప్రసంగం అంటూ ఆవేదన వ్యక్తం చేశారు. తాను ఓ వ్యక్తిగా బయటకు వెళ్తున్నానని, బలమైన శక్తిగా తిరిగి చట్టసభలకు వస్తానంటూ కవిత చెప్పారు. తన రాజీనామాను ఆమోదించాలంటూ మండలి ఛైర్మన్ కు విజ్ఞప్తి చేశారు. అయితే, ఎమ్మెల్సీ కవిత తాజా వ్యాఖ్యలతో ఆమె కొత్త పార్టీపై కొన్ని నెలలుగా సాగుతున్న ప్రచారానికి తెరపడింది.

## ఫోన్ ట్యాపింగ్ కేసులో హరీష్ రావుకు ఊరట

(మొదటి పేజీ తరువాయి)

ప్రభుత్వం తరపున సీనియర్ న్యాయవాది సిద్దార్థ్ లూథ్రా వాదనలు వినిపించారు. అయితే గతంలోనే తన ఫోన్‌ను ట్యాప్ చేయించా రంటూ మాజీ మంత్రి హరీష్ రావుపై రియల్ ఎస్టేట్ వ్యాపారి చక్రధర్ గౌడ్ పంజాగుట్ట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీనిపై ఎఫ్ఐఆర్ కూడా నమోదు అయ్యింది. దీన్ని సవాల్ చేస్తూ హరీష్ రావు తెలంగాణ హైకోర్టును ఆశ్రయించగా.. సరైన ఆధారాలు లేనందున ఈ కేసును కొట్టివేస్తూ హైకోర్టు తీర్పునిచ్చింది. ఈ తీర్పును సవాల్ చేస్తూ తెలంగాణ ప్రభుత్వం సుప్రీం కోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. దీనిపై సోమవారం సుప్రీంలో విచారణ జరుగగా.. తెలంగాణ హైకోర్టు ఇచ్చిన తీర్పులో జోక్యం చేసుకోబోమని జస్టిస్ బీవీ నాగరత్న ధర్మాసనం తేల్చిచెప్పింది. ఎస్ఎల్పీలో జోక్యం చేసుకునేందుకు సుప్రీం ధర్మాసనం నిరాకరించింది. రాధాకిషన్‌రావు, హరీశ్‌రావులకు వ్యతిరేకంగా ప్రభుత్వం వేసిన పిటిషన్లను సుప్రీంకోర్టు కొట్టివేసింది. ఈ వ్యవహారంలో గతంలో దాఖలైన పిటిషన్‌ను హైకోర్టు కొట్టివేసినట్లు జస్టిస్ బీవీ నాగరత్న ధర్మాసనం గుర్తుచేసింది. రాష్ట్ర హైకోర్టు ఇచ్చిన ఆదేశాల్లో జోక్యం చేసుకోలేమని స్పష్టం చేసింది.బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో హరీశ్‌రావు, రాధాకిషన్ రావు ఫోన్ ట్యాపింగ్ చేశారని సిద్దిపేటకు చెందిన రియల్ ఎస్టేట్ వ్యాపారి చక్రధర్ గౌడ్ 2024లో పంజాగుట్ట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీనిపై ఎఫ్ఐఆర్ నమోదు చేసి దర్యాప్తు కూడా చేపట్టారు. అయితే ఈ ఎఫ్ఐఆర్‌ను క్వాష్ చేయాలని హరీశ్‌రావు అదే ఏడాది డిసెంబర్ 4న హైకోర్టును ఆశ్రయించారు. దీనిపై విచారణ జరిపిన ధర్మాసనం.. ఆ ఎఫ్ఐఆర్‌ను క్వాష్ చేస్తూ గత ఏడాది మార్చి 20వ తేదీన ఆదేశాలిచ్చింది. చక్రధర్ గౌడ్ ఫిర్యాదు ఆధారంగా నమోదైన ఎఫ్ఐఆర్‌పై తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మళ్లీ జూన్ 18న సుప్రీంకోర్టును ఆశ్రయించింది. దీనిపై విచారణ జరిపిన సర్వోన్నత న్యాయస్థానం.. ఆ పిటిషన్లను కొట్టివేసింది.

## కవిత వ్యాఖ్యల ఆధారంగా చర్యలు తీసుకోవాలి

(మొదటి పేజీ తరువాయి)

సంబంధించిన ఆధారాలు ఇవ్వడానికి కవిత సిద్ధంగా ఉన్నా.. చర్యలు తీసుకునేందుకు ప్రభుత్వం సిద్ధంగా లేదన్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్య అంతర్గత ఒప్పందం కుదిరిందని ఆయన పేర్కొన్నారు. బీఆర్ఎస్‌ను కాపాడుతోంది.. సీఎం రేవంత్‌రెడ్డేనని బీజేపీ చీఫ్ రాంచందర్ రావు ఆరోపించారు. బీఆర్ఎస్, బీజేపీలు రెండు ఒక్కటే అనడం ఎమ్మెల్సీ కవిత అవగాహనా లోపమని తెలిపారు. సోమవారం నాడు శాసన మండలికి కల్వకుంట్ల కవిత హాజరయ్యారు.

ఈ సందర్భంగా ఆమె కీలక వ్యాఖ్యలు చేశారు. మండలిలో తనది ఇదే చివరి ప్రసంగమని కన్నీరు పెట్టుకున్నారు. ఒక వ్యక్తిగా బయటకు వెళ్తున్నానని..

బలమైన శక్తిగా తాను మళ్లీ చట్ట సభల్లోకి వస్తానంటూ కల్వకుంట్ల కవిత స్పష్టం చేశారు. తన రాజకీయ భవిష్యత్‌తోపాటు తాను ఎదుర్కొన్న పరిస్థితులు, బీఆర్ఎస్ పార్టీపై కవిత హాట్ కామెంట్స్ చేశారు. తన రాజీనామాను ఆమోదించాలంటూ మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డికి ఈ సందర్భంగా కవిత విజ్ఞప్తి చేశారు.

# కొత్తకొండ వీరభద్ర స్వామి బ్రహ్మోత్సవాల ఏర్పాట్లను త్వరితంగా పూర్తి చేయాలి

**హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ కొత్తకొండ శ్రీ వీరభద్ర స్వామి బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై వివిధ శాఖల అధికారులతో సమీక్షా సమావేశం**



**హన్మకొండ, జనవరి 05 (పిసిడబ్ల్యూ న్యూస్):** కొత్తకొండ శ్రీ వీరభద్ర స్వామి బ్రహ్మోత్సవాల ఏర్పాట్లను త్వరితంగా పూర్తి చేయాలని సంబంధిత శాఖల అధికారులను హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ ఆదేశించారు. సోమవారం హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం కొత్తకొండ లోని శ్రీ వీరభద్ర స్వామి బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై ఆలయ ప్రాంగణంలోని కళ్యాణ మండపంలో వివిధ శాఖల అధికారులతో జిల్లా కలెక్టర్ సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ముందుగా శ్రీ వీరభద్ర స్వామి, భద్రకాళి అమ్మవార్లను జిల్లా కలెక్టర్, అధికారులు దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ వేద పండితులు ఆశీర్వచనం అందించారు. ఈ సమావేశంలో దేవాదాయ, పంచాయతీరాజ్ ఇంజనీరింగ్, మిషన్ భగీరథ, జిల్లా పంచాయతీ, విద్యుత్, పోలీస్, వైద్య ఆరోగ్యశాఖ, రెవెన్యూ, ఇతర శాఖల అధికారులతో బ్రహ్మోత్సవాల ఏర్పాట్లు, నిర్వహణపై కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ మాట్లాడుతూ ఈ నెల 9 వ తేదీ నుండి 18 వ తేదీ వరకు జరగనున్న కొత్తకొండ వీరభద్ర స్వామి బ్రహ్మోత్సవాల (జాతర) ఏర్పాట్లను సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో అన్ని ఏర్పాట్లను పూర్తి చేయాలన్నారు. బ్రహ్మోత్సవాలను విజయవంతంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర రవాణా బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదేశించారని పేర్కొన్నారు. ప్రతిష్టాత్మకంగా నిర్వహించే బ్రహ్మోత్సవాలకు వివిధ శాఖలతో పాటు అదనంగా కావాల్సిన ఏర్పాట్లను చేస్తామన్నారు. బ్రహ్మోత్సవాలలో భాగంగా స్వామి వార్లను భక్తులు ప్రశాంత వాతావరణంలో దర్శించుకునేందుకు ఏర్పాట్లు ఉండాలన్నారు. పటిష్ట బ్యారి కేడింగ్ ఏర్పాటు చేయాలన్నారు. పారిశుద్ధ్య నిర్వహణ బాగుండాలన్నారు. రోడ్లకు మరమ్మతులు చేపట్టాలని, జంగిల్ క్లియరెన్స్ చేయాలన్నారు. రాత్రి సమయంలో భక్తులకు ఇబ్బందులు కలగకుండా సరిపోను విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయాలన్నారు. భక్తుల సౌకర్యార్థం తాగునీటి సదుపాయాన్ని ఏర్పాటు చేయాలని అన్నారు. పోలీసు శాఖ ఆధ్వర్యంలో పటిష్ట పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. పార్కింగ్ సమస్య తలెత్తకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో భక్తులకు వైద్య సేవలు అందించే విధంగా ఏర్పాట్లు చేయాలన్నారు. చుట్టు పక్కల ఉన్న స్థలాలను గుర్తించి పార్కింగ్ ఏర్పాటు చేసేందుకు దేవాదాయ, రెవెన్యూ, పోలీస్ శాఖలు సమన్వయంతో చర్యలు చేపట్టాలని అన్నారు. వివిధ శాఖల ఏర్పాట్లను తహసీల్దార్ రాజేష్, ఎంపీడీవో వీరేశం, అధికారులు పర్యవేక్షణ చేయాలన్నారు. ఈ సందర్భంగా దేవాదాయ శాఖ సహాయ కమిషనర్ సునీత మాట్లాడుతూ కొత్తకొండ శ్రీ వీరభద్ర స్వామి బ్రహ్మోత్సవాల నేపథ్యంలో ఆలయానికి రంగులు వేయించామని, భక్తులు స్వామివార్లను దర్శించుకునేందుకు క్యూలైన్లు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. జాతర నేపథ్యంలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ఈ సమావేశంలో స్థానిక సర్పంచ్ సిద్ధమల్ల రమ, విద్యుత్ శాఖ ఎస్ఈ మధుసూదన్, జిల్లా పంచాయతీ అధికారి లక్ష్మీ రమాకాంత్, డిఎంహెచ్వో డాక్టర్ అప్పయ్య, పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ ఈఈ ఆత్మారామ్, ఆర్టీసీ డిఎం అర్పిత, ఎస్సై రాజు, ఆర్ అండ్ బి డీఈ గోపికృష్ణ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# ప్రజావాణి వినతులను త్వరితగతిన పరిష్కరించాలి

**ప్రజావాణి అర్జీలు పెండింగ్‌లో ఉండొద్దు**

**హనుమకొండ జిల్లా కలెక్టరేట్‌లో ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుండి వినతులను స్వీకరించిన కలెక్టర్ స్నేహ శబరీష్**



**హన్మకొండ, జనవరి 05 (పిసిడబ్ల్యూ న్యూస్):** ప్రజావాణి కార్యక్రమంలో వచ్చిన వినతులను త్వరిత గతిన పరిష్కరించాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ అధికారులను ఆదేశించారు.సోమవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో ప్రజావాణి కార్యక్రమంలో అర్జీదారుల నుండి కలెక్టర్ దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ మాట్లాడుతూ ప్రజల నుండి వచ్చిన అర్జీలను త్వరితగతిన పరిష్కరించేందుకు సంబంధిత శాఖల అధికారులను సత్వర చర్యలు చేపట్టాలన్నారు. దరఖాస్తుల పరిష్కార స్వభావాలను వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాలని తెలిపారు. రిమార్కులు లేకుండా దరఖాస్తులను క్లోజ్ చేయరాదన్నారు. అర్జీలు అధికశాతం పెండింగ్‌లో ఉన్న తహశీల్దార్లు, గ్రేటర్‌వరంగల్ మున్సిపల్ కార్పోరేషన్, సర్వే అండ్ ల్యాండ్ రికార్డు శాఖలు పరిష్కానికి సత్వర చర్యలు చేపట్టాలన్నారు. ప్రభుత్వ వసతి గృహాలు తనిఖీ సందర్భంగా అధికారులు ఇందిరమ్మ ఇండ్ల పనుల పురోగతిని, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను సందర్శించాలన్నారు. ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ వేగవంతం చేయాలన్నారు. జిల్లాలో అతి తక్కువ శాతంగా ఉందని మండల ప్రత్యేక అధికారులు ప్రత్యేక దృష్టిసారించి బిఎల్ఓలు, ఆర్పీలు డోర్‌టు డోర్ వెళ్లి ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమం ను వేగవంతంకు చర్యలు చేపట్టాలన్నారు. నలభై సంవత్సరముల పైబడిన, నలభై సంవత్సరముల లోపు వయస్సు కలిగిన వారి కుటుంబ సభ్యుల వివరాలతో 2002 ఓటర్ల జాబితా 2025 ఓటర్ల జాబితాతో మ్యాపింగ్ చేయాలన్నారు. ప్రజావాణి కార్యక్రమంలో వివిధ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ప్రజలు 153 వినతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ రవి, జిల్లా రెవెన్యూ అధికారి వైవి గణేష్, పరకాల, హనుమకొండ ఆర్డీవోలు డాక్టర్ కన్నం నారాయణ, రాథోడ్ రమేష్, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి మేన శ్రీను, ఇతర శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## జనవరి 10 సూర్యపేటలో ఉద్యమకారుల మహాసభ విజయవంతం చేయాలి: విద్యార్థి ఉద్యమ నేతల పిలుపు




**హన్మకొండ, జనవరి 05 (పిసిడబ్ల్యూ న్యూస్):** కాకతీయ యూనివర్సిటీ లో తెలంగాణ విద్యార్థి ఉద్యమకారుల వేదిక, తెలంగాణ స్టూడెంట్ జేఏసీ ఆధ్వర్యంలో చలో సూర్యపేట, జనవరి 10న జరిగే ఉద్యమకారుల బహిరంగ సభను విజయవంతం చేయాలని కోరుతూ అన్ని యూనివర్సిటీల పర్యటనలో భాగంగా కాకతీయ యూనివర్సిటీ ని సందర్శించిన విద్యార్థి ఉద్యమ నాయకులు కంచర్ల బద్రి, చార్వాక, రంజిత్, మహిళా ఉద్యమ నాయకురాలు లావణ్య లతో పాటు వివిధ సంఘాల ప్రతినిధులు, ఉద్యమ నాయకులు పాల్గొని ప్రసంగించారు. తెలంగాణ మలిదశ ఉద్యమంలో ఓయూజేఏసీ , కెయు జేఏసీ నాయకులు ముందు వరసలో ఉండి ఉద్యమాన్ని నడిపించిన చరిత్ర ఉంది అని, తెలంగాణ రాష్ట్రం ఆవిర్భావం తర్వాత గత పాలకులు 10 సంవత్సరాలు ఉద్యమ కారులను విస్మరించారని, అక్రమ కేసులు బనాయించారని మండిపడ్డారు. నేడు కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి కూడా రెండు సంవత్సరాలు గడిచిందని, సీఎం కూడా ఉద్యమకా రులకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో నెరవేర్చడంలో విఫలమయ్యారని దుయ్యబట్టారు. ఉద్యమకారులకు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన హామీలను వెంటనే అమలు చేయాలని, విద్యార్థి సంఘాల ఉద్యమ సంఘాల నేతలు డిమాండ్ చేశారు. దానిలో భాగంగానే తెలంగాణ ఉద్యమ కారుల జాయింట్ యాక్షన్ కమిటీ చేపట్టిన సూర్యపేట బహిరంగ సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కాకతీయ యూనివర్సిటీ ప్రొఫెసర్ చిలివేరి రాజు, సైంటిఫిక్ స్టడీ ఫోరం స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ పెండ్యాల సుమన్, కాకతీయ యూనివర్సిటీ అధ్యక్షులు అమర్నాథ్, కార్యదర్శి శర్మ నాయక్, దళిత బహుజన ఫ్రంట్ నాయకులు చుంచు రాజేందర్, బిసి ఉద్యమ నాయకులు కేడెళ ప్రసాద్, కేయూ విద్యార్థి నాయకులు ఎండి మహబూబ్ పాషా, జి.సుమన్, పి.నరేష్, కవిత, కరుణ,కె. శ్రీనివాస్,. తిరుపతిలు పాల్గొని కార్యక్రమం విజయవంతం చేశారు.

# లేప్రసి కేస్ డిటెక్షన్ క్యాంపెయిన్ పూర్తి

**● 8,13,286 మందిని సర్వే చెయ్యగా 2582 అనుమానితుల గుర్తింపు ● ఐదు కేసులు నిర్ధారణ... కొనసాగుతున్న చికిత్స ● డిఎంహెచ్ఓ డాక్టర్.ఏ.అప్పయ్య**

**హన్మకొండ, జనవరి 05 (పిసిడబ్ల్యూ న్యూస్):** జిల్లాలో లెప్రసీ కేసులు గుర్తించడం అలాగే వ్యాధి గురించి ప్రజల్లో అవగాహన కలిగించడానికి లేప్రసి కేస్ డిటెక్షన్ క్యాంపెయిన్ నిర్వహించి పూర్తి చేసినట్లు హన్మకొండ డిఎంహెచ్ఓ డాక్టర్.ఏ.అప్పయ్య తెలిపారు. ఈ సర్వేలో భాగంగా 2,10,861 గృహాలను సందర్శించి 8,13,286 మంది ప్రజలను సర్వే చేయడం జరిగిందని ఇందులో 2582 మంధిని ప్రాథమికంగా అనుమానితులను గుర్తించడంతో పాటు ఐదుగురిని నిర్ధారించి చికిత్స అందిస్తున్నామని తెలిపారు. ఇంకా అనుమానితులకు పరీక్షలు నిర్వహించి నిర్ధారించిన వారికి చికిత్స అందించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమన్ని అడిషనల్ డీఎంహెచ్ఓ డాక్టర్ జి. మదన్మోహన్రావు ,హెల్త్ ఎడ్యుకేషన్ అధికారి ఎస్ .శ్రీనివాస్, డిపిఎంఓలు సతీష్ రెడ్డి, రవీందర్ లు పర్యవేక్షించగా ఏఎన్ఎంలుల.ఆశలు పాల్గొన్నారని ఆయన తెలిపారు.



## మెట్టి ల్యాబ్, ట్రై కంపెనీలు చేస్తున్న ప్రాజెక్టుకు రైతులు సహకరించగలరని అవగాహన సదస్సు





**ములుగు జిల్లా, జనవరి 05 (పిసిడబ్ల్యూ న్యూస్):** గోవిందరావుపేట మండలంలోని వైశ్య ఫంక్షన్ లో మిట్టి ల్యాబ్ మరియు ట్రై కంపెనీ ఆధ్వర్యంలో రైతు అవగాహన సదస్సు నిర్వహించడం జరిగింది ఈ సందర్భంగా ఈ యొక్క కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ట్రై కంపెనీ జిల్లా మేనేజర్ నేరెళ్ల రాజు మరియు క్లస్టర్ మేనేజర్ సుమన మరియు సంబంధిత అధికారులు హాజరై ట్రై మరియు మిట్టి ల్యాబ్ సంస్థలు చేస్తున్న పర్యావరణ మరియు భూగర్భ జలాలను మరియు భూమిలో ఉన్న మిథిన్ గ్యాస్ వాయువులను రిలీజ్ చేస్తూ రసాయనిక ఎరువులు తక్కువగా వాడుతూ పంటలు పండించడం వల్ల భూమి యొక్క సార్వత్వాన్ని కాపాడుతూ పంటలు పండియాలని చెప్పి రైతులకు అవగాహన సదస్సు నిర్వహించడం జరిగింది మరియు ట్రై కంపెనీ చేస్తున్న ప్రాజెక్టుకు రైతులు సహకరించగలరని కోరడమైనది ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా గ్రామ సర్పంచి భూక్య జోక్య నాయక్ మరియు ఉప సర్పంచ్ పెండెం శ్రీకాంత్ మరియు చల్వాయి మాజీ ఎంపీటీసీ బోనగాని సారయ్య మరియు రైతులు ట్రై కంపెనీ ఫీల్డ్ ఆఫీసర్లు ములుగు జిల్లా క్లస్టర్ మేనేజర్ దేవేందర్ మరియు గోవిందరావుపేట మండల్ ఫీల్డ్ ఆఫీసర్స్ బద్రి రాజేంద్రప్రసాద్ మరియు జూనియర్ ఫీల్డ్ ఆఫీసర్స్ చిక్కుల వెంకటేష్ సంతోష్ సాంబయ్య ప్రేమ్ కృష్ణ శ్రీ ప్రియ హైమావతి సంపూర్ణ రంజిత్ లక్పతి రమేష్ మరియు తదితరులు హాజరవడం జరిగింది

# 30 వార్డులలో ఓటరు జాబితాలలో అవకతవకలు

**● ఒక వార్డులోని ఓట్లు మరొక వార్డులో బిజెపి పట్టణ అధ్యక్షులు జి సందీప్**



**నర్సంపేట జనవరి 05 (పీసీడబ్ల్యూ న్యూస్):** భారతీయ జనతా పార్టీ నర్సంపేట పట్టణ అధ్యక్షులు గూడూరు సందీప్ ఆధ్వర్యంలో నర్సంపేట మున్సిపాలిటీ ఎన్నికల సందర్భంగా మున్సిపాలిటీలో ఉన్నటువంటి 30 వార్డులలో ఓటరు జాబితాలలో అంతా అవకతవకగా మారి ఒక వార్డులోని ఓట్లు మరొక వార్డులో రావడం జరిగింది. అలాగే నర్సంపేట మున్సిపాలిటీ పరిధిలో కాకుండా వేరే మండలాలకు సంబంధించిన ఓటర్లు మరియు వేరే జిల్లాలకు సంబంధించిన బోగస్ ఓట్లు కూడా ఇక్కడ నమోదు కావడం జరిగింది. నర్సంపేట మున్సిపాలిటీ పరిధిలో లేని ఓట్లను ఇక్కడ నమోదు చేయడానికి గల కారణం ఏంటి ఇలా చేయడం ఎవరికి మేలు చేయడం కోసం చేశారు,కావున 30 వార్డుల ఓటరు జాబితాలను మళ్ళీ పరిశీలించి సరియైన విధానంలో ఓటరు జాబితాలను తయారు చేయాలని నర్సంపేట మున్సిపల్ కమిషనర్ కి లిఖితపూర్వకంగా రాసి మెమోరండం ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు జూలూరు మనీష్ గౌడ్, అచ్చ దయాకర్, కొంకిస విగ్నేష్ గౌడ్, కోమండ్ల సప్తగిరి, పట్టణ ప్రధాన కార్యదర్శి కందికొండ శ్రీనివాస్, చిలువేరు అన్వేష్, తాళ్లపల్లి రాము మరియు బిజెపి నాయకులు పాల్గొన్నారు.

## గ్రామ అభివృద్ధికి కృషి చేస్తా...: సర్పంచ్ పెరిక నాగేశ్వర రావు



**తల్లాడ,జనవరి 5 (పిసిడబ్ల్యూ న్యూస్) :**ప్రజల భాగస్వామ్యంతో గ్రామ అభివృద్ధికి కృషి చేస్తాననిమేజర్ గ్రామ పంచాయితీ సర్పంచ్ పెరిక నాగేశ్వర రావు (చిన్నబ్బాయి) అన్నారు. ఇటీవల శబరిమల వెళ్ళి అయ్యప్ప స్వామి దర్శనం అనంతరం సోమవారం మేజర్ గ్రామ పంచాయితీ కి రావడం జరిగింది. గ్రామ పంచాయితి సెక్రెటరీ, గ్రామ పంచాయితీ సిబ్బందితో పంచాయితీ కి సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ పెరిక నాగేశ్వర రావు మాట్లాడుతూ తల్లాడ ప్రజల నాయకుల సలహాలు సూచనల ప్రకారం మేజర్ గ్రామ పంచాయితీ నీ అభివృద్ధి పదంలో ఉండేలా కృషి చేస్తానని, నాతో పాటు పాలకవర్గం కూడా అందరూ కృషి చేయాలని కోరారు. గ్రామం లో ఉన్న సమస్యలను కూడా వాటిని త్వరితగతిన పరిష్కారం అయ్యే విదంగా కృషి చేస్తానని అన్నారు. ఈ సందర్భంగా నాయకులు, వార్డు మెంబర్లు సర్పంచ్ కి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపినారు. ఈ కార్యక్రమం లో బిఆర్యస్ పార్టీ మండల అధ్యక్షుడు రెడ్డెం వీర మోహన్ రెడ్డి, మాజీ ఏఎంసి వైస్ చైర్మన్ ధూపాటి భద్ర రాజు, టిడిపి మండల అధ్యక్షుడు సరికొండ శ్రీనివాసరాజు, ఉపసర్పంచ్ కర్నాటి లక్ష్మ రెడ్డి, వార్డు సభ్యులు వేమిరెడ్డి చిన్న కృష్ణారెడ్డి, కమాల్, తదితరులు పాల్గొన్నారు.

## ఆత్మహత్యకు ఎత్తించిన యువకుడ్ని కాపాడిన మిల్స్ కాలనీ పోలీసులు



**హన్మకొండ, జనవరి 5 (పిసిడబ్ల్యూ న్యూస్)** :దేశాయిపేట ప్రాంతానికి చెందిన మంద వినోద్ అనే యువకుడు ఆర్థిక ఇబ్బందుల కారణంగా సోమవారం వరంగల్లోని రైల్వే ట్రాక్ పై ఆత్మహత్యకు యత్నిస్తుండగా, సమాచారం అందుకున్న మిల్స్ కాలనీ పోలీస్ స్టేషన్ కు చెందిన కానిస్టేబుల్ సంతోష్ రెడ్డి, మహిళా కానిస్టేబుల్ రాధిక సంఘటన స్థలానికి చేరుకొని ఆత్మహత్యకు సిద్ధపడిన యువకుడ్ని పోలీసులు రక్షించి, సదరు యువకుడికి పోలీసులు కౌన్సిలింగ్ నిర్వహించి అతని కుటుంబ సభ్యులకు అప్పగించడమైంది

# శ్రీ పద్మావతి డ్రై క్లీనర్స్ షాప్ ప్రారంభం

**- కార్యక్రమానికి అతిధిగా హాజరైన కేయూ జేఏసీ చైర్మన్ కత్తెరపల్లి దామోదర్**





**హన్మకొండ,జనవరి 5(పిసిడబ్ల్యూ న్యూస్):** ఈరోజు స్థానిక కాకతీయ యూనివర్సిటీ యూనివర్సిటీ క్రాస్ రోడ్డు వద్ద శ్రీ పద్మావతి డ్రై క్లీనర్స్ షాప్‌నీ నూతనంగా ప్రారంభోత్సవ కార్యక్రమానికి అతిధిగా హాజరైన కేయూ జేఏసీ చైర్మన్ కత్తెరపల్లి దామోదర్ ఈ కార్యక్రమంలో డ్రై క్లీనర్ ప్రొప్రైటర్ రాజు, కేయూ రజక విద్యార్థి సంఘం ఇన్చార్జి కొరపల్లి రాజేష్, రాజ్ కుమార్, మునికుంట్ల రాజు, పి రఘు,తదితరులు ఉన్నారు.

# ఘనంగా ప్రారంభమైన 30వ డివిజన్ యూత్ క్రికెట్ పోటీలు...




**కరీంనగర్,జనవరి05(పీసీడబ్ల్యూ న్యూస్):** కీ.శే. కొమ్ముల ప్రేమ్ సాగర్ జ్ఞాపకార్థం, యువజన నేత కల్లేపల్లి బాలరాజ్ ఆధ్వర్యంలో కరీంనగర్ 30 వ డివిజన్ యూత్ క్రికెట్ పోటీలు సోమవారం రోజున అంబేద్కర్ స్టేడియంలో ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా బాల్ రాజ్ మాట్లాడుతూ 30 డివిజన్ యువకులు క్రీడల్లో రాణించడానికి, డివిజన్లోని యువత ప్రతిభను చాటి చెప్పడానికి క్రికెట్ పోటీలను ప్రారంభించడం జరిగిందని తెలిపారు. ఎలాంటి రిజిస్ట్రేషన్ ఫీజు లేకుండా ఇట్టి పోటీలను నిర్వహించడం జరుగుతుందని, పోటీల్లో గెలుపొందిన జట్లకు విన్నర్ కు బహుమతిగా రూ.50 వేలు, రన్నర్ కు 25 వేలు ఇవ్వనున్నట్లు తెలిపారు.

# మాధవ సేవా సమితి ఆధ్వర్యంలో 164 మంది పిల్లలకు స్వర్ణామృత ప్రాసన చుక్కల మందు..




**కరీంనగర్ టౌన్ జనవరి 5 (పిసిడబ్ల్యూ న్యూస్):** మాధవ సేవా సమితి కరీంనగర్ శాఖ ఆధ్వర్యంలో సోమవారం రోజున మాధవ నిలయంలో స్వర్ణామృత ప్రాసన చుక్కల మందు పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో 164 మంది పిల్లలు స్వర్ణామృతప్రాసన చుక్కల మందును ఉపయోగించుకున్నారు. ఈ కార్యక్రమంలో ప్రాంత కార్యావాహ ఆదరనీయ కాచం రమేష్ , మాధవ సేవా సమితి అధ్యక్షులు సీఏ నిరంజనా చారి. మానవీయ జిల్లా సహా సంఘ చాలక ఎలగందుల సత్యనారాయణ, విభాగ్ సహ కార్యవాహ మురళి జీ, సమితి కార్యదర్శి కామరపు ప్రసాద్ పాల్గొన్నారు.



# గంగాధరనడుచుకుంటూ వెళుతున్న వ్యక్తిని బైక్ డీ వ్యక్తి మృతి





**గంగాధర జనవరి 5(పిసిడబ్ల్యూ న్యూస్):** కరీంనగర్ జిల్లా చొప్పదండి నియోజకవర్గం గంగాధర మండలంలోని మధురానగర్ లో తేదీ 04 /01/2026 సాయంత్రం అందాద 6:30 గంటల సమయంలో గంగాధర మండలం గోపాలరావుపల్లి చెందిన అమ్ముల విజేందర్ S/O బాలయ్య వయస్సు 46 సంవత్సరాలు అను వ్యక్తి మధుర నగర్ లోని తన ఇంటి నుండి గంగాధర ఎక్స్ రోడ్ నడుచుకుంటూ వెళ్తుండగా బోయినపల్లి నుండి గంగాధర ఎక్స్ రోడ్ వైపు వెళ్తున్నటువంటి బైక్ AP 15BJ 2518 అను నెంబర్ గల బైకులు అతివేగంతో, అజాగ్రత్తగా నడుపుకుంటూ వచ్చి వెనుక నుండి విజేందర్ ను ఢీకొనడంతో అతడు అక్కడే కిందపడగా అతని కాలికి, చేతులకి, ముక్కు నుండి రక్తం కారుతున్నా గాయాలు కాగా చికిత్స కొరకు ఆసుపత్రికి తరలించగ అప్పటికే మృతి చెందినట్లు డాక్టర్ తెలిపారు మరియు బైకు నడిపిన వ్యక్తి వివరాలు తెలుసుకోగ అతని పేరు శివరాత్రి నవీన్ అతనికి కూడా తీవ్ర గాయాలు అయ్యి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నా డు. ఇట్టి సంఘటనపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు గంగాధర ఎస్సై వంశీకృష్ణ తెలిపారు.

# వివేకానంద విద్యార్థులకు జాతీయ స్థాయి రంగోత్సవ్ అవార్డుల బహుకరణ





**గంగాధర జనవరి 5 (పిసిడబ్ల్యూ న్యూస్):** కరీంనగర్ జిల్లా చొప్పదండి నియోజకవర్గం గంగాధర మండలకేంద్రంలోని వివేకా నంద విద్యాయలయం లో ఇటీవల జాతీయ స్థాయిలో రంగోత్సవ్ పోటీలు నిర్వహించడం జగింది. ఈ పోటీలలో జాతీయ స్థాయిలో మొదటిమరియు నాలుగవ బహుమతులతో పాటు 136 మంది విద్యార్థులు బంగారు,వెండి ,కాస్యం బహుమతులు గెలుపొందారు. ఈ సందర్భంగా బహుమతులు గెలుపొందిన విద్యార్థులకు పాఠశాల ఆవరణలో అవార్డులు బహుకరించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ స్రవంతి ,అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ హరిత పాల్గొని రోడ్డు భద్రత అవగాహన గురించి పిల్లలకు మరియు వారి తల్లితండ్రులకు వివరించడం జరిగింది. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి పాఠశాల ప్రిన్సిపాల్ లక్ష్మారెడ్డి గారు మాట్లాడుతూ విద్యతో పాటు సాంస్కృతిక వైభవాన్ని చాటేందుకు పిల్లల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీయడానికి ప్రతి సంవత్సరం నిర్వహించే రంగోత్సవ్ పోటీలలో విద్యార్థులు పాల్గొనాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో గంగాధర సర్పంచ్ పడాల భాగ్యలక్ష్మి–రాజన్న,ఉపసర్పంచ్ శ్రీనివాస్,వార్డ్ సభ్యులు నగేష్,పాఠశాల డైరెక్టర్ ఆనంత రెడ్డి,ప్రధానోపాధ్యాయులు నర్సింగరావు, ఉషా రాణి,ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు,విద్యార్థిని విద్యార్థులు మరియు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# తప్పుల తడకగా మున్సిపల్ ఓటర్ జాబితా

- **ఒక డివిజన్లో నివాసముంటే మరొక డివిజన్ లో ఓటు ఎలా సాధ్యం..?**
- **చనిపోయిన వారివి, డబుల్ ఓట్లను తొలగించండి**
- **ఒక ఇంట్లో 5గురు ఉంటే 20నుంచి 30ఓట్లు ఎలా ఉన్నాయి**
- **క్షత్రస్థాయిలో పరిశీలించి ఓటరు జాబితాలో లోటుపాట్లను సరిదిద్దాలని ఎంఐఎం నేత గులాం అహ్మద్ వినతి**



**కరీంనగర్ టౌన్ జనవరి 5(పిసిడబ్ల్యూ న్యూస్):** కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికలకు సంబంధించి ఓటర్ లిస్టు తప్పుల తడకగా ఉందని, పోలింగ్ స్టేషన్లకు అనుగుణంగా డివిజన్ లోని ఇంటి నెంబర్ల ఆధారంగా ఓటర్ల జాబితాను సరి చేయాలని ఎంఐఎం కరీంనగర్ అధ్యక్షుడు సయ్యద్ గులాం అహ్మద్ హుస్సేన్, సోమవారం మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయిని కలిసి వినతి పత్రం అందజేశారు. ఒక డివిజన్ లోని ఓటర్లను మరొక డివిజన్లో చేర్చారు. గతంలో ఎంఐఎం పార్టీ తరఫున గతంలో తాము లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేసినప్పటికీ, ఎన్నో లోపాలను అందులో జిల్లా అధికారుల, మున్సిపల్ అధికారుల దృష్టికి తెచ్చినప్పటికీ ఓటర్ల జాబితాలో గతంలో జరిగిన పొరపాట్లే ఇప్పుడు ఉన్నాయని చెప్పారు. నగరంలోని మున్సిపల్ డివిజన్లలో ప్రకటించిన ప్రకారం ఇంటి నెంబర్ల ఆధారంగా సంబంధిత డివిజన్లలో ఓటర్లను పొందుపర్చి, ఓటరు జాబితాను సవరించాలి. సంబంధిత డివిజన్లలో లేనటువంటి ఓటర్లను వారు ప్రస్తుతం నివసిస్తున్నటువంటి డివిజన్లకు బదిలీ చేయాలని కోరారు. గతంలో జరిగినటువంటి లోపాలు పొరపాట్లు ప్రస్తుతం ఉన్న ఓటరు జాబితాలో స్పష్టంగా కనిపిస్తున్నాయని విమర్శించారు. పోలింగ్ స్టేషన్లను ఇప్పటివరకు తమరు ప్రకటించలేదని, ఓటరు జాబితాలో ఉన్న ఓట్లు సంబంధిత డివిజన్ పోలింగ్ స్టేషన్లకు సంబంధం లేకుండా ఉన్నాయని ఆరోపించారు. ఎంతమంది ఓటర్లకు ఒక పోలింగ్ స్టేషన్ ఏర్పాటు చేస్తున్నారో అది కూడా స్పష్టం చేయాలని విజ్ఞప్తి చేశారు. కుల గణన సర్వే ను ఇంటింటికీ తిరిగి క్షత్రస్థాయిలో నిర్వహించాలని, చనిపోయిన వారి ఓట్లను లిస్టులో డబుల్ ఓట్లను గుర్తించి తొలగించాలన్నారు. ఒక్కో ఇంటిలో నలుగురు లేదా ఐదుగురు ఉన్నప్పటికీ కొన్ని ఇండ్లలో 20 నుంచి 30 వరకు ఓట్లు ఉన్నాయి. ఆ ఇండ్లలో అంత మంది ఓటర్లు లేనప్పటికీ ఇతర ప్రాంతాలకు చెందిన వారిని ఇక్కడ ఓటర్లుగా నమోదు కాబడినవి వాటిని తొలగించాలన్నారు. ఎక్కువగా ఓట్లు ఉన్న ఇండ్లను గుర్తించి క్షత్రస్థాయిలో విచారణ జరిపి ఉన్న ఇండ్లలో ఉన్న వారిని కొనసాగించి డివిజన్లకు సంబంధం లేని ఇతర వ్యక్తుల ఓట్లను తక్షణమే తీసివేయాలని డిమాండ్ చేశారు.

# మంత్రి అడ్లూరిని కలిసిన మాజీ మంత్రి మోత్కుపల్లి, మాదిగ శక్తి వ్యవస్థాపక అధ్యక్షులు బొంకూరి సురేందర్ సన్ని



**పెద్దపల్లి జనవరి 5 (పిసిడబ్ల్యూన్యూస్):** ఉమ్మడి రాష్ట్ర మాజీమంత్రి మోత్కుపల్లి నరసింహులు ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ను ఆయన అధికారిక నివాసంలో మాదిగశక్తి వ్యవస్థాపక అధ్యక్షులు బొంకూరి సురేందర్ సన్ని కలిశారు. ఈ సందర్భంగా మాదిగ ప్రొఫెసర్లు, ఓ.యూ ఉద్యమకారులు , వివిధ సంఘాల ప్రతినిధులు సుమారు 50 మంది మాదిగ ప్రతినిధుల బృందం మంత్రికి శాలువ, పూల బొకేతో సన్మానించి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం రాష్ట్రంలో మాదిగల పరిస్థితులపై చర్చించి, అంబేద్కర్ అభయ హస్తం పథకాన్ని అమలు పరిచేలా చూడాలని మంత్రి అడ్లూరిని బొంకూరి సురేందర్ సన్నీ కోరారు. అసెంబ్లి ఎన్నికల్లో చేవెళ్ల భారీ బహిరంగ సభలో చేవెళ్ల డిక్లరేషన్ పేరుతో ప్రతి దళిత కుటుంబానికి 12 లక్షల రూపాయలు, ఎస్ సీలకు 18 శాతం రిజర్వేషన్లు, ప్రత్యేక కార్పొరేషన్లు, ఇలా దళిత సమాజానికి ఇచ్చిన హామీల ను వెంటనే అమలు పరిచేలా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో చర్చించి వెంటనే అమలు చేయాలని కోరినట్లు. ఇలా చేస్తే రాష్ట్రంలోని దళిత కుటుంబాలు అభివృద్ధిలోకి వచ్చి ఆర్థికంగా,రాజకీయంగా, సామాజికంగా ఎదుగుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మాదిగ సంఘాల సీనియర్ నాయకులు, ప్రొఫెసర్లు, ఉస్మానియా యూనివర్సిటీ విద్యార్థి సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

# కరీంనగర్ జిల్లా మహిళా కాంగ్రెస్ సమీక్ష సమావేశం..







**కరీంనగర్ టౌన్ జనవరి 05(పిసిడబ్ల్యూ న్యూస్):** కరీంనగర్ జిల్లా మహిళా కాంగ్రెస్ పార్టీ సమీక్ష సమావేశం జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు కర్ర సత్యప్రసన్న రెడ్డి అధ్యక్షతన జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించబడింది. ఈ సమావేశంలో ముఖ్యంగా మహిళా సాధికారత అంశంపై విస్తృతంగా చర్చ జరిగింది. ఈ సందర్భంగా సత్యప్రసన్న రెడ్డి మాట్లాడుతూ, గ్రామస్థాయి నుంచి మహిళా కాంగ్రెస్‌ను మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. రాబోయే మునిసిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించేందుకు మహిళా కాంగ్రెస్ కార్యకర్తలు, నాయకురాళ్లు కష్టపడి పనిచేయాలని పిలుపునిచ్చారు. మహిళలు పోటీ చేస్తున్న స్థానాల్లో కాంగ్రెస్ పార్టీ తరఫున ప్రచారం నిర్వహించాలని సూచించారు. రాబోయే ఎన్నికల్లో నిజాయితీగా పనిచేసిన మహిళా కాంగ్రెస్ నాయకురాళ్లకు టికెట్లు అందించేలా కృషి చేస్తానని ఆమె హామీ ఇచ్చారు. అలాగే కరీంనగర్ జిల్లా నామినేటెడ్ పోస్టుల భర్తీలో మహిళా కాంగ్రెస్‌లో కష్టపడి పనిచేసిన మహిళలకు సముచిత స్థానం కల్పించే దిశగా ప్రయత్నం చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో కరీంనగర్ జిల్లా మహిళా కాంగ్రెస్ ఇంచార్జ్, రాష్ట్ర మహిళా కాంగ్రెస్ వైస్ ప్రెసిడెంట్ గాజుల సుకన్య, నగర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు వంగల కళ్యాణి రెడ్డి, వెన్నం రజిత రెడ్డి, మానకొండూర్ నియోజకవర్గ మహిళా కాంగ్రెస్ ఇంచార్జ్ కవ్వ పద్మ, కరీంనగర్ నియోజకవర్గ మహిళా కాంగ్రెస్ ఇంచార్జ్ హసీనా, జిల్లా మహిళా కాంగ్రెస్ బ్లాక్, మండల, పట్టణ అధ్యక్షులు, కరీంనగర్ కార్పొరేషన్ డివిజన్ మహిళా అధ్యక్షులు తదితర మహిళా నాయకులు పాల్గొన్నారు.

# వారసత్వ భూమి ఆక్రమణకు కుట్ర

- **కట్టుకుంటున్న ఇంటిని కూల్చేందుకు యత్నం**
- **ఎవ్వరూ సహకరించొద్దంటూ హుకుం జారీ**
- **- మీడియా సమావేశంలో న్యాయం చేయాలని వేడుకున్న వృద్ధురాలు**




**ఖమ్మం ప్రతినిధి, జనవరి 5 (పిసిడబ్ల్యూ న్యూస్) :** నానమ్మ, అమ్మ నుండి వారసత్వంగా వచ్చిన ఇంటి స్థలాన్ని ఆక్రమించుకునేందుకు మంత్రి అనుచరులమని చెప్పుకుంటున్న కొంతమంది బెదిరింపులకు గురిచేస్తున్నారని, కట్టుకుంటున్న ఇంటిని కూల్చేందుకు ప్రయత్నించారని, వారి నుండి తనను కాపాడి న్యాయం చేయాలని వైరా పట్టణం, బ్రాహ్మణపల్లికి చెందిన వృద్ధురాలు కిలారు పద్మజ కోరారు. సోమవారం ఖమ్మంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆమె తన ఆవేదనను వ్యక్తం చేశారు. బ్రాహ్మణపల్లిలోని సర్వే నెంబర్ 1లో 963 చదరపు గజాలుండగా అందులో వారసత్వంగా, కోర్టు ద్వారా 465 చదరపు గజాల ఇంటి స్థలం వచ్చిందని తెలిపారు. ఆ స్థలాన్ని నా కూతురు మద్దిపాటి చంద్రలేఖకు పసుపు కుంకుమ కింద బహుమతిగా రిజిస్ట్రేష్టన్ చేయించి ఇచ్చానని తెలిపారు. 2024, జూలై 25న పణితి సైదులు, వడ్డాణపు రాంబాబు, పోటు మధుసూదన్‌రావు, గాదె రమేష్‌రెడ్డి, వడ్డాణపు శ్రీను, చెరుకూరి కోటేశ్వరరావు, ఏవురు సామ్రాజ్యం, ఆమె అల్లుడు వాసు తదితరులు కలిసి మూకుమ్మడిగా నా కూతురుకిచ్చిన స్థలాన్ని ఆక్రమించి ప్లాట్లుగా చేసి విక్రయిస్తున్న సమాచారం తెలుసుకున్న తాము వచ్చి అడ్డుకున్నామని, తర్వాత కాంపౌండింగ్ చేసుకుని ఇంటి నిర్మాణం చేపట్టామని తెలిపారు. మళ్లీ 2024 సెప్టెంబర్ 2న పైన పేర్కొన్న వ్యక్తులు తమ ఇంటి నిర్మాణాన్ని నిలిపివేయాలంటూ తమపై దాడి చేయగా స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా ఎలాంటి చర్యలు తీసుకోలేదని వాపోయారు. కొంత పైసలు ఇచ్చి తమను స్థలం నుండి తరివేయాలని చూస్తున్నారని, బెదిరింపులకు గురి చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. వారి నుండి కాపాడాలంటూ గ్రీవెన్స్‌డేలో, పోలీస్ కమిషనర్ కు సోమవారం వినతిపత్రం ఇచ్చామని తెలిపారు. బెదిరింపులకు గురిచేస్తున్న వారిపై చర్యలు తీసుకుని తమకు న్యాయం చేయాలని కోరారు.

# డివిజన్లో ఓటర్ జాబితా మార్పు చేయాలని, తప్పులను సరిదిద్దాలని బిజెపి నేతల ఫిర్యాదు...

**కరీంనగర్,జనవరి05(పీసీడబ్ల్యూ న్యూస్):** కరీంనగర్ నగరపాలక సంస్థ 7, 36, 51, 64 డివిజన్ ల ఓటరు జాబితాలో అనేక తప్పిదాలు, పొరపాట్లు, అవకతవకలు జరిగాయని, తక్షణం ఓటర్ లిస్టు సవరణ చేయాలని ఆయా డివిజన్ల బిజెపి నేతలు, కాంటెస్టెడ్ కార్పొరేటర్లు తోట సాగర్, తోట అనిల్ , కొమ్మెర రవీందర్ రెడ్డి, బండారి ఆంజనేయులు, శాన గోండశ్రీనివాస్ ( వాసు) లు సోమవారం రోజున జిల్లా కలెక్టర్, మున్సిపల్ కమిషనర్లకు ఫిర్యాదు చేశారు. ఏడవ డివిజన్ హౌసింగ్ బోర్డు, సదాశివ పల్లి కలిపి గతంలో 5207 ఓట్లు ఉంటే తాజాగా ప్రకటించిన ముసాయిదాలో ఓటర్ల సంఖ్య 6846 కి చేరిందని, దాదాపు 1279 మంది ఓట్లు కరీంనగర్ పట్టణంలోని లోని వివిధ ప్రాంతాల నుండి నమోదు అయ్యాయని, డివిజన్ కు సంబంధంలేని పోలింగ్ బూతు కేంద్రాల నుండి ఆ ఓట్లు ఏడో డివిజన్లో నమోదు అయ్యాయని, అలాగే అనేక బోగస్ ఓట్లు కూడా డివిజన్లో నమోదు అయ్యాయని, తక్షణం ఈ విషయంపై చర్యలు తీసుకొని, ఓటర్ జాబితాను సవరించాలని కంటెస్టెడ్ కార్పొరేటర్ తోట సాగర్ సోమవారం రోజున జిల్లా కలెక్టర్కు ప్రజావాణిలో



ఫిర్యాదు చేసి వినతిపత్రం సమర్పించారు. 36వ డివిజన్ ఓటర్ లిస్టులో అనేక అవకతవకలు జరిగాయని, దాదాపు లక్ష్మీ నగర్ కు చెందిన దాదాపు 200 ఓట్లు, గ్రామీణ ప్రాంతాల ఓట్లు 36వ డివిజన్లో నమోదు చేశారని, వెంటనే వాటిని తొలగించి ఓటరు జాబితాను సవరించాలని బిజెపి నేత తోట అనిల్ ఆధ్వర్యంలో కొంపల్లి సాగర్, తిరుమణి కరుణాకర్, చింతల ప్రభాకర్, కమటం చందు, రాధారపు శ్రీకాంత్, కొయ్యల కారి క్రాంతి, దర్శనాల కృష్ణ, పల్లెర్ల రనేష్ లు మున్సిపల్ కమిషనర్ కు ఫిర్యాదు చేశారు. 51 డివిజన్లో మాజీ కార్పొరేటర్ ఇంటి నంబరు 3-7-329, 322, 293 ల పై 42 అక్రమ ఓట్లు నమోదయాయని, అలాగే డివిజన్ మొత్తంగా 400 ఓట్లు నమోదు అయ్యాయని, వెంటనే ఆ ఓట్లను తొలగించడానికి చర్యలు తీసుకోవాలని బిజెపి నేతలు కొమ్మెర రవీందర్ రెడ్డి, బండారి ఆంజనేయులు మున్సిపల్ కమిషనర్ కు ఫిర్యాదు చేశారు.64 వ డివిజన్ ఓటరు జాబితా సవరణ చేయాలని కార్పొరేటర్ శానగోండ శ్రీనివాస్ (వాసు) మున్సిపల్ కమిషనర్ కు ఫిర్యాదు చేశారు. గతంలో 60 వడివిజన్ నేడు 64వ డివిజన్ అయిందనీ,అయితే ప్రస్తుత 64వ డివిజన్లో ఓటర్ జాబితాలో అనేక పొరపాట్లు, తప్పిదాలు జరిగాయని, 64 డివిజన్ ఓటర్ జాబితాను సవరించడానికి తగిన చర్యలు చేపట్టాలని వాసు అధికారులను కోరారు.

# మైనారిటీ ఉద్యోగుల సమస్యలపై న్యూఢిల్లీలో కీలక సమావేశం..

## • రిజర్వేషన్ కంపాషనేట్ నియామకాల లోపాలపై చర్చ...

**కరీంనగర్ టౌన్ జనవరి 05(పిసి డబ్ల్యూ న్యూస్):** తెలంగాణ రాష్ట్రంలో మైనారిటీ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలపై న్యూఢిల్లీలో జరిగిన కీలక సమావేశంలో ఆల్ ఇండియా మైనారిటీ ఎంప్లాయీస్, పెన్షనర్స్ అసోసియేషన్ జాతీయ అధ్యక్షులు సామిన్ అన్సారీ, యునైటెడ్ఉతెలంగాణ ఎంప్లాయీస్ అసోసియేషన్ ఫర్ మైనారిటీస్ (యునైటెడ్-టీం) రాష్ట్ర అధ్యక్షులు షేక్ నిసార్ అహ్మద్తో పాటు పలువురు ముఖ్య అధికారులు విస్తృతంగా చర్చించారు.ఈ సమావేశంలో ముఖ్యంగా రిజర్వేషన్ నియమాల (రూల్ ఆఫ్ రిజర్వేషన్) సమర్థవంతమైన అమలు లోపాలు, అలాగే కంపాషనేట్ అపాయింట్మెంట్స్లో జరుగుతున్న ఆలస్యాలు, నియమావిరుద్ధ నిర్ణయాలు ప్రధాన చర్చాంశాలుగా నిలిచాయి. మైనారిటీ ఉద్యోగులు మరియు వారి కుటుంబాలకు న్యాయం దూరమవుతున్న పరిస్థితిపై నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా సామిన్ అన్సారీ మాట్లాడుతూ, రిజర్వేషన్ విధానాల కట్టుదిట్టమైన అమలు, వ్యవస్థాగత సంస్కరణలు, దేశవ్యాప్తంగా మైనారిటీ సంక్షమ సంస్థల్లో ప్రత్యేక పోస్టులు మరియు కేడర్ ఏర్పాట్లు అత్యవసరమని తెలిపారు. ఇవి సమాన ప్రతినిధిత్వం మరియు ఉద్యోగోన్నతులకు దోహదపడతాయని పేర్కొన్నారు. షేక్ నిసార్ అహ్మద్ మాట్లాడుతూ, కంపాషనేట్ అపాయింట్మెంట్స్లో పారదర్శకత లేకపోవడం వల్ల అర్హులైన మైనారిటీ కుటుంబాలు తీవ్రంగా నష్టపోతున్నాయని అన్నారు. అన్ని శాఖల్లోనూ నియమాలకు కట్టుబడి అమలు జరగాలని, అధికారుల జవాబుదారీతనం పెంచాలని డిమాండ్ చేశారు.మైనారిటీ ఉద్యోగుల రాజ్యాంగ హక్కుల పరిరక్షణ కోసం రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో సమన్వయంతో నిరంతర చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందని సమావేశంలో పాల్గొన్న నాయకులు ఏకాభిప్రాయానికి వచ్చారు.





# శ్రీనగర్ గ్రామంలో మానవతా దృక్పథంతో ఆర్థిక సహాయం....



**మల్లంపల్లి మండల ప్రతినిధి జనవరి 5(పిసిడబ్ల్యూ న్యూస్):** మల్లంపల్లి మండలం శ్రీనగర్ గ్రామానికి చెందిన మేకల విజయ్ గారి అకాల మరణం గ్రామంలో తీవ్ర విషాదాన్ని నింపింది. ఈ కష్టసమయంలో మృతుని కుటుంబానికి అండగా నిలవాలని భావించిన శ్రీనగర్ గ్రామస్తులు ఐక్యంగా ముందుకు వచ్చి రూ.57,200/- (యాభై ఏడు వేల రెండు వందల రూపాయలు) ఆర్థిక సహాయాన్ని అందజేశారు.గ్రామస్తుల సహకారంతో సమీకరించిన ఈ మొత్తాన్ని కుటుంబ సభ్యులకు అందజేసి మానవత్వానికి ఉదాహరణగా నిలిచారు. ఈ సందర్భంగా ఆర్థిక సహాయానికి సహకరించిన ప్రతి ఒక్కరికీ కుటుంబ సభ్యులు పేరుపేరునా హృదయపూర్వక ధన్యవాదములు తెలిపారు.ఈ సంఘటన శ్రీనగర్ గ్రామ ప్రజల ఐక్యతను, సామాజిక బాధ్యతను చాటిచెప్పిందని గ్రామ పెద్దలు పేర్కొన్నారు.

# పోమాలపల్లి సర్పంచ్, ఉప సర్పంచ్లకు ఘన సన్మానం

**షాద్ నగర్, జనవరి 5(పిసిడబ్ల్యూ న్యూస్):** పోమాలపల్లి గ్రామ సర్పంచిగా బుర్రి స్వప్న, ఉప సర్పంచ్గా బుర్రి భూపాల్ రెడ్డి ఎన్నికైన సందర్భంగా ఆఫీసర్స్ కాలనీలో నివాసం ఉంటున్న భూపాల్ రెడ్డి దంపతులను ఆఫీసర్స్ కాలనీ అభివృద్ధి కమిటీ సభ్యులు, కాలనీవాసులు ఘనంగా సన్మానించారు. ఈ సన్మాన కార్యక్రమం నిన్న అభయంజయ స్వామి గుడి ఆవరణలో నిర్వహించారు.అదేవిధంగా నాగులపల్లి ఉప సర్పంచిగా ఎన్నికైన కిరణ్ గౌడ్ను కూడా ఈ సందర్భంగా సన్మానించారు. నూతన ప్రజాప్రతినిధులు గ్రామాభివృద్ధికి అంకితభావంతో పని చేసి ప్రజల ఆశలు నెరవేర్చాలని కాలనీవాసులు ఆకాంక్షించారు. కాలనీవాసుల అధ్యక్షుడు చెట్ల నరసింహ, మాజీ కౌన్సిలర్ పావని, హర్మల్ రవిప్రకాష్, ఈశ్వర్ టీచర్ రాజు, ఎల్ఐసి రాజు, చెట్ల శంకర్, చెట్ల వెంకటేష్, తిరుపతి గౌడ్, విశ్వనాథ్, జుట్టు నరసింహ, రెవెన్యూ డిపార్ట్మెంట్ వెంకట్రెడ్డి పాల్గొన్నారు.

# కరీంనగర్ మున్సిపల్ ఓటర్ల జాబితాలో భారీ అవకతవకలు

## మున్సిపల్ కమిషనర్కు వినతిపత్రం సమర్పించిన యువ నాయకులు



**కరీంనగర్ టౌన్ జనవరి 5(పిసిడబ్ల్యూ న్యూస్):** కరీంనగర్ మున్సిపాలిటీ పరిధిలో 01-01-2026న విడుదలైన ముసాయిదా ఓటర్ల జాబితాలో తీవ్ర అవకతవకలు చోటుచేసుకున్నాయని ఆరోపిస్తూ, పలు రాజకీయ పార్టీలకు చెందిన యువ నాయకులు సోమవారం సాయంత్రం 4:30 గంటలకు మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ను ఆయన చాంబర్లో కలిసి వినతిపత్రం సమర్పించారు.మున్సిపల్ కార్పొరేటర్గా పోటీ చేయనున్న యువ నేతలు సంయుక్తంగా ఈ అంశాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఈ కార్యక్రమంలో మెరాజుద్దీన్ (బీఆర్ఎస్), సురేష్ (ఏఐఎంఐఎం), అబ్దుల్ గఫ్ఫార్ లయన్, చవారియా కరణ్ సింగ్ (బీఆర్ఎస్), చాడ ఆనంద్ (బీజేపీ), ఆసిఫ్ (కాంగ్రెస్) పాల్గొన్నారు.వారి వినతి పత్రంలో ఓటర్ల జాబితా తయారీలో పలు లోపాలు ఉన్నాయని వివరించారు. ముఖ్యంగా నకిలీ ఓట్లను తొలగించడం, ఇతర డివిజన్లకు చెందిన ఓట్లను సంబంధిత డివిజన్లకు మార్చడం, ఇంటి నంబర్ల క్రమబద్ధత లేకపోవడం, ఇతర వార్డుల ఓటర్లు తమ వార్డుల్లో నమోదవడం, ఇంటి నంబర్లు లేకుండా ఓటర్ల నమోదు చేయడం, జీఓ ఎంఎస్ నం.144 (21-06-2025) నిబంధనలకు విరుద్ధంగా ఓటర్ల నమోదు జరగడం, అలాగే అర్హులైన పలువురు ఓటర్ల పేర్లు జాబితాలో లేకపోవడం వంటి అంశాలను వారు ప్రస్తావించారు.ఈ అంశాలపై సమగ్ర విచారణ జరిపి, ఎన్నికల ముందు అందిన అన్ని ఇన్వర్డ్ దరఖాస్తులకు న్యాయం చేయాలని కమిషనర్ను వారు కోరారు. దీనిపై స్పందించిన కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ సమస్యను పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు సమాచారం.



# మత్తులో చిత్తవుతున్న యువత?.



## - వారి బంగారు భవిష్యత్తుకు దూరమవుతున్నారు?.

## - ప్రధాన రహదారుల్లో రైరైమంటూ స్పీడు పక్క వారికి బెంబేలు ఎత్తిస్తున్న యువకులు?





**తొర్రూరు ప్రతినిధి, జనవరి 5(పిసిడబ్ల్యూ న్యూస్):** రాష్ట్రం నలుమూలల ఏ ప్రాంతం చూసినా ఇదే పరిస్థితి గతంలో పట్టణాలలో బడాబాబులు వారికున్న అలవాటు ప్రకారంగా చిన్నారుల కంటపడకుండా ఏదో ఒక మారుమూల ప్రాంతంలో మద్యం సేవించేవారు?.పల్లె ప్రాంతాలలో పూర్వకాలంలో వారికున్న అనుభవాన్ని బట్టి నాటు సారాను ఎవరికి వారే తయారు చేసుకుని వారి ఇంటిలోనే సారాయిని తయారు చేసుకుని సేవించేవారు?. ఎక్కడైనా యువకులు మద్యం సేవిస్తున్నారని తెలిస్తే పెద్దవారు యువకులను మందలించే పరిస్థితి ఒకనాడు ఉండేది ,నేడు పరిస్థితుల్లో పెద్దలతో సంబంధం లేకుండా యువకులే మత్తులో మత్తుపదార్థాలలో మునిగితేలుతున్నారు. యువకులు మద్యం సేవించాలంటే దూర ప్రాంతాలలో చాటు మార్గంగా మధ్యాన్ని సేవిస్తూ ఉండే అలవాటు పోయి ప్రస్తుతం గ్రామీణ ప్రాంతాలలో, పట్టణ ప్రాంతాలలో ఏర్పాటుచేసిన షాపులలోని విచ్చలవిడిగా మద్యాన్ని సేవిస్తున్నారు?. మద్యమే కాకుండా గంజాయి లాంటి మత్తు పదార్థాలు లాంటి మారకద్రవ్యాలు పాఠశాల విద్యార్థుల వరకు కూడా ఈ మత్తు వెళ్తుంది అంటే దేశం ఎటు పోతుంది . కొన్ని ప్రాంతాలలో ఆందోళనకరంగా ఉన్నది అంటున్నారు పరిశీలకు?. గ్రామాలలో ఒకటి రెండు బెల్ట్ షాపులు ఉంటే అవి కాస్త కొన్ని గ్రామీణ ప్రాంతాల్లో కిరాణా షాపుల్లో కూడా బెల్ట్ షాపులా ఏర్పాటు చేసి విచ్చలవిడిగా మద్యాన్ని అమ్ముతుంటే మద్యం ప్రేమికులు వాటికి బానిసలైపోయి చేసిన కష్టానికి వచ్చిన కూలీ డబ్బులు కూడా మత్తు పదార్థాలకే అంకితం చేస్తూ వారి బంగారు భవిష్యత్తును నాశనం చేసుకోవడమే కాకుండా ఇంటిలో డబ్బులు తీసుకువెళ్ళక ఇల్లు గడిచేది కష్టంగా ఉందని ఇంట్లోని మహిళలు కూడా గొడవకు దిగుతున్నారంటే మత్తు పదార్థాలు మనిషిని ఎంతవరకు నాశనం చేస్తున్నాయో ఆలోచన చేస్తేనే బంగారు భవిష్యత్తు ఎలా మారుతుంది అనటానికి అర్థం కాకుండా ఉందని కొందరు భావిస్తున్నారు? రాష్ట్ర భవిష్యత్తును కూడా ప్రమాదాల్లోకి నెట్టేస్తుందన్నారు. మత్తు పదార్థాల వినియోగం వల్ల విద్యార్థుల్లో చదువుపై ఆసక్తి తగ్గి మానసిక ఒత్తిడి పెరగడం కుటుంబ కలహాలు ,నేర ప్రవృత్తి వైపు వెళ్లడం వంటివి పెరుగుతున్నాయని దీని ప్రభావంతో రోడ్డు ప్రమాదాలు, చోరీలు, దాడులు వంటి నేరాలు కూడా అధికమవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు మత్తు నిర్మూలనకు ప్రభుత్వం, పోలీసు యంత్రాంగం చర్యలు తీసుకున్నప్పటికీ క్షేత్రస్థాయిలో మరింత కఠిన మైనవి అమలు, నిరంతరం నిఘా అవసరమని పలువురు సూచిస్తున్నారు. పోలీసులు కూడా ఎప్పటికప్పుడు తనిఖీలు నిర్వహిస్తున్నారు. అయినప్పటికీ కూడా యువకుల్లో ఎలాంటి మార్పు రావడంలేదని ఆవేదన ఆందోళన వ్యక్తం చేస్తున్నారు?. పోలీసులు మత్తు పదార్థాలు సేవించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని పేర్కొంటున్నారు. మొత్తం నిర్మూలనకు అవగాహన ప్రధాన ఆయుధమనీ అంటూ పేర్కొంటూ పాఠశాలలు, కళాశాలలు ,గ్రామ సభలను కాలనీలో నిరంతరం అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచిస్తున్నారు పలువురు అనుభవజ్ఞులు. యువతను క్రీడలు, నైపుణ్యాభివృద్ధి సేవా కార్యక్రమాల వైపు మళ్ళిస్తేనే సమాజం ఆరోగ్యవంతం మై భవిష్యత్తు దిశగా ముందుకు సాగుతుందని కొందరు అభిప్రాయపడుతున్నారు. నగరాలు, గ్రామీణ ప్రాంతాలు అన్న తేడా లేకుండా కళాశాలలు పరిసరాలు, హాస్టల్ ,పరిశ్రమల ప్రాంతాలు, బస్టాండ్లు, రైల్వే స్టేషన్, సమీపల్లో మత్తు పదార్థాలను అక్రమ రవాణా విస్తరిస్తూదని దీని అరికట్టేందుకు పోలీసులు కూడా ఎన్నో రకాల చర్యలు తీసుకున్నప్పటికీ మారుమూల ప్రాంతంలో ఎక్కడ కూడా దొరకకుండా ఏదో ఒక రకంగా మత్తు పదార్థాలను అమ్ముతూనే ఉన్నారు అని అంటున్నారు. మారుమూల ఉన్న గ్రామ ప్రాంతాలలో రహదారులను ఏర్పాటు చేసుకొని ఎవరూ చూడకుండా ఉండే ప్రదేశంలో మత్తు పదార్థాలను సేవించడమే కాకుండా విక్రయిస్తున్న ప్రాంతాలు కూడా లేకపోలేదని అంటున్నారు .ఈ మధ్యకాలంలో గ్రామీణ ప్రాంతంలో కూడాఒక రహదారిలో మద్యాన్ని సేవి సేవించిన యువకుడు రహదారుల వెంట బైకుపై వెళ్తున్న ఇద్దరు యువకులను ఢీ కొట్టి న సందర్భాలు కూడా లేకపోలేదు .తరచు ఆ ప్రాంతంలోని ప్రమాదాలు జరుగుతున్న పోలీసుల కంటపడకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారని విశ్వసనీయ సమాచారం?. గ్రామీణ ప్రాంతాలలో ఉన్న కొన్ని బెల్ట్ షాపులను తొలగిస్తే ఎంత కొంత గ్రామ ప్రాంత వాసులకు మెరుగవుతుందని యువత చెడు దారి పట్టకుండా కొంత అరికట్టే దిశగా చూసేందుకు వీలవుతుందని పరిశీలకులు భావిస్తున్నారు?.

# సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి

● తొర్రూర్ ఎస్ఐ ఉపేందర్ అవగాహన సదస్సు ఏర్పాటు



**తోరూర్ ప్రతినిధి, జనవరి 5(పిసీడబ్ల్యూ న్యూస్):** మహబూబాబాద్ జిల్లా తొర్రూర్ పట్టణంలోని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సైబర్ నేరాలపై అవగాహన సదస్సును కళాశాల ఐక్యూ ఏసి విభాగం ఆధ్వర్యంలో నిర్వహించారు. (ఇంటర్నేషనల్ క్వాలిటీ అష్యోరియన్స్ సెల్ ).కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ అధ్యక్షతన ఏర్పాటు చేశారు. ఈ అవగాహన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తొర్రూరుఎస్సై ఉపేందర్ పాల్గొని అధ్యాపకులకు, విద్యార్థులకు, సైబర్ నేరాలపై కీలక సూచనలు చేశారు .ఆన్లైన్ మోసాలపై అవగాహన కలిగి ఉంటే వాటి వాటిని అరికట్టగలమని ఎస్ఐ తెలిపారు .అపరిచితుల నుంచి వచ్చే ఫోన్ కాల్ భయపడి వ్యక్తిగత వివరాలు ఓటీపీలు, బ్యాంకు సమాచారం వెల్లడించడం కూడదని హెచ్చరించారు. వివిధ రకాల మోసాలు చేస్తూనే ఉన్నారని ఉదాహరణలో వివరించిన ఎస్సై డిజిటల్ అరెస్ట్ అనే వ్యవస్థ అసలు దేశంలో లేని లేదని స్పష్టం చేశారు . ప్రిన్సిపాల్ డాక్టర్ బి రాములు ప్రసంగిస్తూ సైబర్ నేరాలపై యువత పూర్తిగా అవగాహన కలిగి ఉండి ఇతరులను కూడా పరచాలని ఆయన సూచించారు .రవీందర్ రెడ్డి ప్రసంగిస్తూ సెల్ఫోన్లో వచ్చే ఆకర్షణీయమైన ప్రకటనలు నిర్ధారించుకోకుండా మోసపోతున్నారని అన్నారు. కళాశాల సీనియర్ అధ్యాపకులు డాక్టర్ శాంతి కుమార్ ,డాక్టర్ సుజాత, డాక్టర్ వాల్య ,డాక్టర్ సుజాత ,డాక్టర్ సునీల్ ,డాక్టర్ అంజూ ఆరా వీరితోపాటు అధ్యాపకేతర సిబ్బంది అధ్యాపకులు పెద్ద సంఖ్యలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## మీషన్ మగ్దంపురం ఫౌండేషన్ ఆధ్వర్యంలో చందు బంజారా యూత్ సభ్యులకు జెర్సీ టీషర్ట్‌లు పంపిణీ

● డివిజన్ వ్యాప్తగా ఉన్న యువకులకు షటిల్ టోర్నమెంట్ మరియు మహిళలకు ముగ్గుల పోటీలు



**నర్సంపేట జనవరి 05 (పీసీడబ్ల్యూ న్యూస్):** ముగ్దంపురం గ్రామంలోని చందు బంజారా యూత్ అసోసియేషన్ సభ్యులకు ప్రోత్సాహకంగా మీషన్ ముగ్దంపురం ఫౌండేషన్ వ్యవస్థాపకులు మంద కార్తీక్ గౌడ్ జెర్సీ(టీ షర్ట్) లను అందించడం జరిగింది. అనంతరం మంద కార్తీక్ గౌడ్ మట్లాడుతూ గ్రామంలోని యువత క్రీడ స్ఫూర్తిని పెంపొందించాలని ఉద్దేశంతో వారికి జెర్సీ లను అందించడం జరిగిందని తెలియజేశారు, అదే విధంగా వచ్చే సంక్రాంతి పండుగకు నర్సంపేట డివిజన్ వ్యాప్తి గా ఉన్న యువకులకు షటిల్ టోర్నమెంట్ ను ,మహిళలకు ముగ్గుల పోటీలను చందు బంజారా యూత్ ఆధ్వర్యంలో నిర్వహించటం జరుగుతుందని వారు తెలియజేశారు..ఈ కార్యక్రమంలో యూత్ సభ్యులు సురేష్,సంతోష్,అంజన్ ,లక్కీ, విజయ్, తిరుపతి,శ్రీహరి, శ్రీను, దుర్గా, మురళి తదితరులు పాల్గొన్నారు.

## రానున్న మున్సిపాలిటీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ సత్తా చాటాలి

పట్టణ అధ్యక్షుడు సోమశేఖర్ అధ్యక్షతన కార్యకర్తల సమావేశం ఏర్పాటు.

ఎమ్మెల్యే యశస్విని రెడ్డి, టీపీసీసీ ఉపాధ్యక్షరాలు ఝాన్సీ రాజేందర్ రెడ్డి ఆదేశాల మేరకు



**తొర్రూర్ ప్రతినిధి, జనవరి 5(పిసిడబ్ల్యూ న్యూస్):** మహబూబాబాద్ జిల్లా తొర్రూర్ పట్టణంలోని 1,2,8 వార్డులలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు సోమశేఖర్ అధ్యక్షతన సోమవారం ముఖ్య కార్యకర్తల సమావేశం ఏర్పాటు చేశారు .రానున్న మున్సిపల్ ఎన్నికల్లో భాగంగా పాలకుర్తి ఎమ్మెల్యే టీపీసీసీ ఉపాధ్యక్షరాలు ఝాన్సీ రాజేందర్ రెడ్డిల ఆదేశాల మేరకే ఈ కార్యక్రమం ఏర్పాటు చేశామని అన్నారు. గత ప్రభుత్వంలో ఎలాంటి అభివృద్ధి జరగలేదని అర్హులకు సంక్షమ పథకాలు అందజేయడంలోవిఫలమైందని పేర్కొన్నారు .కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం తొరూరు మున్సిపాలిటీలోని అన్ని వార్డులలో అర్హులైన లబ్ధి లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇల్లు, రేషన్ కార్డులు అందించడం జరిగిందని రెండో విడతలో ఇందిరమ్మ ఇల్లు లబ్ధిదారులకు గుర్తించి అందిస్తామన్నారు. నిరుపేదలను ఎంపిక చేసి డబల్ బెడ్ రూమ్ ఇండ్లను ఎమ్మెల్యే చేతుల మీదుగా పట్టాలను పంపిణీ చేయనున్నట్లు పేర్కొన్నారు మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులను గెలిపించుకోవాలన్నారు. కార్యక్రమంలో టిపిసిసి మాజీ సభ్యుడు ముత్తినేని సోమేశ్వరరావు ,కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పెదగాని సోమయ్య , బాపూ రెడ్డి, మంగళంపల్లి రామచంద్రయ్య, జీనుగు రాజేందర్ రెడ్డి, భూసాని రాము ,దొంగ రేవతి శంకర్ ,రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ హాస్టళ్లను ప్రత్యేక అధికారులు తనిఖీ చేయాలి: హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్



**హనుమకొండ ,జనవరి 5(పిసీడబ్ల్యూ న్యూస్):** ప్రభుత్వ వసతి గృహాలను ప్రత్యేకాధికారులు నెలలో రెండు సార్లు తప్పని సరిగా తనిఖీ చేయాలని, టీచర్లు లేకుండా విద్యార్థులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను వినాలని జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ మండల ప్రత్యేకాధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాలులో ప్రజావాణి కార్యక్రమం అనంతరం మండల ప్రత్యేక అధికారులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ మాట్లాడుతూ వసతి గృహాల్లో ఫిర్యాదుల పెట్టె (కంప్లైంట్ బాక్స్) తప్పని సరిగా ఉండాలని దానికి సంబంధించిన తాళం ప్రత్యేక అధికారి వద్ద మాత్రమే ఉండాలన్నారు. వసతి గృహా ల్లో హెల్త్ క్యాంపులు ఏర్పాటు చేసి విద్యార్థుల ఆరోగ్య సమస్యలను పర్యవేక్షంచాలన్నారు. వసతి గృహాల్లో ప్రధానంగా విద్యా, ఆరోగ్యం, శానిటేషన్ పట్ల ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు. మెనూ ప్రకారం ఆహారం అందిస్తున్నారా లేదా పరిశీలించాలన్నారు. వసతి గృహాల తనిఖీ సందర్భంలో మండల ప్రత్యేక అధికారులు విద్యార్థులతో కలిసి బోజనం చేయాలన్నారు. వారి సమస్యలను విని అక్కడికక్కడే పరిష్కరించాలని కలెక్టర్ తెలిపారు. ఈ సమావేశంలో వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## నర్సంపేట బిజెపి పార్టీ సాంస్థగత కన్వీనర్ ఎన్నిక

బిజెపి పెద్దలకు కృతజ్ఞతలు తెలిపిన గూడూపూడి రాధాకృష్ణ



**నర్సంపేట,జనవరి 5(పిసీడబ్ల్యూ న్యూస్):** నాపై నమ్మకంతో బీజేపీ ,నర్సంపేట నియోజకవర్గ సంస్థాగత కన్వీనర్ నియమించి, పార్టీకి సేవ చేసే అవకాశం కల్పించిన రాష్ట్ర అధ్యక్షులు ఎన్. రాంచందర్ రావు కి, రాష్ట్ర సంఘటన మంత్రి. చంద్రశేఖర్ జీ , కేంద్రమంత్రివర్యుల. జీ.కిషన్ రెడ్డి కి, బండి సంజయ్ అన్నకి, ఎంపీలు ఈటెల రాజేందర్ అన్నగారికి, రఘునందన్ రావు కి, క్రమశిక్షణ కమిటీ చైర్మన్ ఎం.ధర్మారావుకి, వరంగల్ జిల్లా ఇంచార్జి కొండపల్లి శ్రీధర్ రెడ్డి కి,,నన్ను వెన్నుతట్టి ప్రోత్సహిస్తూ నన్ను ముందుకు నడిపిస్తున్న మనందరి శ్రేయోభిలాషి వరంగల్ జిల్లా అధ్యక్షులు గంట రవన్న కి, మరియు నర్సంపేట నియోజకవర్గ నాయకులు.. జిల్లా ప్రధానకార్యదర్శి గోగుల రాణా ప్రతాప్ రెడ్డి కి హృదయపూర్వక ధన్యవాదములు నర్సంపేట నియోజకవర్గంలోని రాష్ట్ర, జిల్లా నాయకులు, నియోజకవర్గ నాయకులు, మండల అధ్యక్షులు, మోర్చాల నాయకులు, సీనియర్ నాయకులు కార్యకర్తలు బీజేపీ కుటుంబ సభ్యులకు ధన్యవాదములు అందరి సహకారంతో పార్టీని బూత్ స్థాయి నుండి పటిష్ట పరిచి, నర్సంపేటలో కాషాయ జెండా ఎగిరేలా పార్టీ అభివృద్ధి కి కృషి చేస్తాను, పార్టీ కార్యకర్తలకు అండగా ఉంటూ కంటికి రెప్పలా కాపాడుకుంటాను గూడూపూడి రాధాకృష్ణ తెలిపారు.

# సాంప్రదాయాల ప్రతీక ముగ్గుల పోటీ

● విశ్వబ్రాహ్మణ విశ్వకర్మ మాతృ సంఘం జిల్లా అధ్యక్షుడు అద్దంకి నాగేశ్వరావు



ఖమ్మం ప్రతినిధి, **జనవరి 5 (పిసిడబ్ల్యూ న్యూస్) :** సంక్రాంతి పండుగ వస్తుందంటే రెండు తెలుగు రాష్ట్రాల్లో ముందుగా గుర్తుకొచ్చేది అందమైన రంగు రంగుల ముగ్గులు. సంక్రాంతి పండుగ సందర్భంగా మహిళలు, యువతులు, ఇంటి ముందు వేసే ముగ్గులు అనేక రంగులు రకరకాల ఆకృతులతో ఎంతో అందంగా వేస్తారు. అటువంటి సంస్కృతి సాంప్రదాయాల కనుగుణంగా ఖమ్మం నగర 'విశ్వబ్రాహ్మణ విశ్వకర్మ' మాతృ సంఘం 59వ డివిజన్ దానవాయిగూడెంలో విశ్వబ్రాహ్మణ ఆడపడుచులు సోమవారం ముగ్గుల పోటీని ఘనంగా నిర్వహించారు. అనంతరం ముగ్గుల పోటీలో గెలిచిన మహిళలకు ఆకర్షణీయమైన బహుమతులను ఆ సంఘం అందజేసింది. ఇటువంటి సాంప్రదాయ ముగ్గులను ప్రతి సంవత్సరం నిర్వహించాలని అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా ఖమ్మం జిల్లా విశ్వబ్రాహ్మణ విశ్వకర్మ మాతృ సంఘం జిల్లా అధ్యక్షుడు అద్దంకి నాగేశ్వరావు, ప్రధాన కార్యదర్శి పెండొట సోమేశ్వర చారి, ఉపాధ్యక్షులు విజయగిరి సదానంద చారి, ఖమ్మం నగర విశ్వబ్రాహ్మణ విశ్వకర్మ అధ్యక్షుడు వసంత బాబు, ప్రధాన కార్యదర్శి దేశరాజ వెంకటేశ్వర్లు, కోశాధికారి నందిగాం బ్రహ్మం, జస్టిస్ ఖమ్మం జిల్లా విశ్వబ్రాహ్మణ మహిళ అధ్యక్షురాలు గన్నోజు గోవిందమ్మ, ప్రముఖ కవియిత్రి, పాఠ్య పుస్తక రచయిత్రి ఊర్మిళ సునంద, తాడోజు వెంకటాచారి, 59 డివిజన్ కార్పొరేటర్ బట్టపోతుల లలితరాణి, ఐతగాని రాఘవులు విచ్చేసి ముగ్గులు వేసిన మహిళలు, యువతులను అభినందించారు.



## సైబర్ నేరాల పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలి

● పెనుబల్లి ఎస్సై వెంకటేష్



**పెనుబల్లి, జనవరి 5 (పిసిడబ్ల్యూ న్యూస్) :**సైబర్ నేరాల పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని వియం బంజార ఎస్సై వెంకటేష్ అన్నారు. ఫ్రాడ్ కా ఫుల్ స్టాప్ కార్యక్రమంలో భాగంగా వియం బంజార బస్టాండ్ లో ప్రయాణికులకు వియం బంజారా పోలీస్ స్టేషన్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఆయన మాట్లాడుతూ రోజు రోజుకు సైబర్ నేరాలు పెరిగిపోతున్నాయని, ఉద్యోగాలు, లోన్లు వంటివి ఇప్పిస్తామని ఎవరైనా అపరిచిత వ్యక్తులు ఫోన్ చేస్తే నమ్మవద్దని సూచించారు. ఏదైనా సైబర్ నేరం జరిగితే వెంటనే 1930 హెల్ప్‌లైన్‌కు కాల్ చేయాలని లేదా www.cybercrime.gov.in వెబ్‌సైట్‌లో ఫిర్యాదు చేయాలని సూచించారు. డిజిటల్ అరెస్ట్‌లు, ఆన్‌లైన్ మోసాల గురించి అప్రమత్తంగా ఉండాలని, ముఖ్యంగా సీనియర్ సిటిజన్లు జాగ్రత్త వహించాలని కోరుతున్నారు, తద్వారా ఆర్థిక మోసాలను అరికట్టవచ్చని వివరించారు.

## వస్త్రాలంకరణ వేడుకలో చైర్మన్ మువ్వా





**సత్తుపల్లి, జనవరి 5 (పిసిడబ్ల్యూ న్యూస్) :**రాణి సెలెబ్రేషన్స్ ఫంక్షన్ హాల్ నందు బల్లెం చిరంజీవి, సుమలత దంపతుల కుమార్తె మహిమ, కుమారుడు అభిషిక్త్ నూతన వస్త్రాలంకరణ వేడుకలో తెలంగాణ ఇరిగేషన్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ నువ్వా విజయ్ బాబు పాల్గొని చిన్నారులను ఆశీర్వదించినారు. ఈ వేడుకలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పొంగులేటి, మువ్వా అభిమానులు పాల్గొన్నారు.

## చెక్ డ్యామ్‌లను కూల్చివేసిన వారిపై చర్యలు తీసుకోవాలి: మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణా రెడ్డి




**చిట్యాల జనవరి 5 (పిసిడబ్ల్యూ న్యూస్):** గతంలో చెక్ డ్యామ్ కూల్చిన ప్రదేశాన్ని భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణా రెడ్డి సందర్శించారు.చిట్యాల మండలం నవాబ్ పేట గ్రామం మరియు మొగుళ్ళపల్లి మండలం పోతుగల్లు గ్రామాల మధ్యలో రైతుల సంక్షేమం కోసం బిఆర్ఎస్ ప్రభుత్వంలో తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ గారిని ఒప్పించి చలివాగుపై నిర్మించిన చెక్ డ్యామ్‌ను కొంతమంది బాంబులతో పేల్చి ధ్వంసం చేయడంతో ప్రస్తుతం విలువైన నీరు వృథాగా వెళ్లిపోతుందని ఆవేదన వ్యక్తం చేశారు.ఈ చెక్ డ్యామ్ ద్వారా గతంలో రెండు పంటలు సునాయాసంగా పండేవని, మత్స్యకారులకు ఉపాధి లభించేదని గుర్తు చేశారు.



# అక్రమ మైనింగ్ గ్రానైట్ తవ్వకాలు పరిరక్షణకు విఘాతాలు....

- అక్రమ మైనింగ్‌కు అడ్డుకట్ట వేసి పర్యావరణాన్నీ కాపాడాలి...
- నారాయణగిరిలో ఉన్న చారిత్రక , ఆధ్యాత్మిక ప్రాంతాలను కాపాడాలి....
- జిల్లా కలెక్టర్ ఫిర్యాదు చేసిన గ్రామస్థుడు మజ్జిగ లింగం...




**హన్మకొండ,జనవరి 5(పిసిడబ్ల్యూ న్యూస్):** అక్రమ మైనింగ్, గ్రానైట్ తవ్వకాలు చారిత్రక సంపదను, జైనులు బుద్ధులు ధ్యానం చేసిన, ఆనవాళ్ళు ఆధారాలను శిలాశాసనం నాశనం అవుతున్న ఎవరు పట్టించుకోవడం లేదని, హన్మకొండ జిల్లా ధర్మసాగర్ మండలంలోని నారాయణగిరి గ్రామ శివారులో జరుగుతున్న అక్రమ మైనింగ్, క్రషర్, గ్రానైట్ కంపెనీ లను మూసివేసి ఆయా ప్రాంతాల్లో ఉన్న చారిత్రక, ఆధ్యాత్మిక సంపదను కాపాడాలని గ్రామానికి చెందిన ఓ వ్యక్తి జిల్లా కలెక్టర్ కు ఫిర్యాదు చేశారు. నారాయణగిరి శివారులో ఉన్న నరసింహ స్వామి గుట్ట, మధ్యలోని బోడు, బొడగుట్ట ప్రాంతాలల్లో తెలంగాణ చారిత్రక ఆధారాలు, జైనుల, బుద్ధుల ధ్యానం చేసిన ఆధారాలు, ఆనవాళ్లు, గుర్తులు, ఆ ప్రాంత పరిసరాల్లో ఓ శిలాశాసనం ఉన్నట్లు లేఖలో పేర్కొన్నారు. అలాగే ఇక్కడ అనుమతులకు మించి అక్రమ మైనింగ్, గ్రానెట్ తవ్వకాలు జరుగుతున్నాయని, వీటి ద్వారా పర్యావరణ పరి రక్షణకు విఘాతం కలగడమే కాకుండా, ఇక్కడ నుండి వెళ్లే భారీ వాహనాలతో రోడ్లు ధ్వంసం అవుతూన్నాయని పేర్కొన్నారు. నిత్యం భారీ వాహనాల రాకపోకలతో ఇటు వాహనదారులు, అటు విద్యార్థులు చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఫిర్యాదులో తెలిపారు. పురావస్తు శాఖ అధికారులు చారిత్రక ప్రాంతాల్లో పర్యటించి ఆధ్యాత్మిక చరిత్ర కలిగిన అంశాలను గుర్తించి కాపాడాలని, అలాగే మైనింగ్ ను అరికట్టాలని కోరారు.

# ఫోర్జరీ సంతకాలతో ఇంటికి ఎసరు..?

- మద్యానికి బానిసైన భర్తతో ఇల్లు అమ్మినట్టు సంతకాలు..?
- న్యాయం చేయాలని వేడుకుంటున్న మహిళా, ఇద్దరు చిన్నారులు





**ఖమ్మం ప్రతినిధి, జనవరి 5 (పిసిడబ్ల్యూ న్యూస్) :** మద్యానికి బానిసైన తన భర్తకు మద్యం ఆశజూపి ఫోర్జరీ సంతకాలు, నకిలీ దస్తావేజులు సృష్టించి తమ ఇల్లు కాజెయ్యలని చూస్తున్నారని ఇందిరానగర్ కాలనీకి చెందిన సంధ్య తన ఇద్దరు పిల్లలతో కలసి కబ్జాకు గురైన ఇంటిముందు సోమవారం దీక్షకు దిగింది. 2011 లో తాము బ్రతుకుదేరువుకోసం హైదరాబాద్ వెళ్లిన సమయంలో కొల్లి రామకృష్ణ, కొల్లి పవన్, కత్తి భాస్కర్ లు తన భర్తను విలాసాలకు అలవాటుచేసి 38 వేలు అప్పు ఇచ్చినట్లు చెప్పి, వడ్డీతో సహా ఇవ్వాలని అప్పు చెల్లించేవరకు ఇంట్లో కిరాయికి ఉంటామని నమ్మబలికి తనతో ఖాళీ ప్రామిసరీ నోటుపై సంతకం పెట్టించుకొని, ఆ సంతకాన్ని 50 రూపాయల బాండ్ పేపర్ పై కంప్యూటర్ లో ఎడిటింగ్ చేసి నకిలీ బాండ్ పేపర్ ను తయారు చేసి, తమ ఇల్లు విక్రయించినట్లు ఫోర్జరీ సంతకాలు పెట్టి తన 68 గజాల ఇంటిని కాజేయ్యాలని చూస్తున్నారని ఆవేదన వ్యక్తం చేసింది. ఇల్లు మాకు అప్పగించకపోతే మీ అంతు చూస్తామని నేరచరిత్ర కల్గిన వ్యక్తులను మా పైకి పంపించి బెదిరింపులకు పాల్పడుతున్నారని వాపోయారు. తీసుకున్న అప్పు కడతామని చెప్పినా వినకుండా దొంగ డాక్యుమెంట్లతో వచ్చి బెదిరింపులకు పాల్పడుతున్నారని పోలీసు ఉన్నతాధికారులు ఫోర్జరీ సంతకాలు వెలికితీసి తనకు న్యాయం చేయాలని తన పిల్లలతో కలసి ప్రాధేయపడింది.

# తెలంగాణ రాష్ట్ర అర్చకుల సమస్యలను తీర్చండి: గట్టు శ్రీనివాసచార్యులు

అర్చకులకు ఉద్యోగులకు సదుపాయాలు కల్పించండి

ఉద్యోగ భద్రత హెల్త్ కార్డులు అందించండి



**హైదరాబాద్ డిసెంబర్ 05 (పిసిడబ్ల్యూ న్యూస్):** హైదరాబాద్, మేడిపల్లి డిబిఆర్ గార్డెన్లో తెలంగాణ రాష్ట్ర అర్చక సమాఖ్య ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి సమావేశాన్ని ఏర్పాటు చేయడం జరిగిందని తెలంగాణ రాష్ట్ర అర్చక సమైక్య అధ్యక్షులు మరియు భాగ్యనగర అర్చక పురోహిత సంఘం రాష్ట్ర వ్యవస్థాపకులు గట్టు శ్రీనివాసచార్యులు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలోని దేవాదాయ ధర్మాదాయ శాఖ పరిధిలో ఉన్న ఆలయాలలో విధులు నిర్వహిస్తున్న అర్చకులు, అదే విధంగా అదే ఆలయాలలో కన్సాలిడేటెడ్ మరియు లేబర్ యాక్ట్ కింద విధులు నిర్వహిస్తున్న అర్చకుల సమస్యలను దృష్టిలో పెట్టుకొని, వారందరికీ తగిన న్యాయం జరిగే విధంగా ప్రభుత్వానికి వినతిపత్రం సమర్పించుటకు మరియు మా సమస్యలను వారి దృష్టికి తీసుకువెళ్లుటకు ఈ సమావేశం ఏర్పాటు చేయబడిందని దేవాదాయ ధర్మాదాయ శాఖ పరిధిలో పనిచేస్తున్న పై స్థాయి ఉద్యోగులకు సమాన వేతనం, ఉద్యోగ భద్రత, హెల్త్ కార్డులు, ప్రతి నెల ఒకటో తేదీన జీతాల చెల్లింపు, పదవీ విరమణ అనంతరం పెన్షన్ వంటి సదుపాయాలు ఉన్నప్పటికీ, కిందిస్థాయి అర్చకులు మరియు ఉద్యోగులకు ఎలాంటి సదుపాయాలు లేకపోవడం అత్యంత బాధాకరమైన విషయమని,ఈ రోజు కూడా అనేక మంది అర్చకులు రూ.3,000 నుండి రూ.10,000 రూ.15,000 వరకు మాత్రమే వేతనం పొందుతూ అర్చక విధులను నిర్వహిస్తున్నారు. ఒకే ఆలయంలో ఒకే విధమైన విధులు నిర్వహిస్తున్నప్పటికీ సమానమైన వేతన విధానం లేకపోవడం వల్ల తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఈ సమస్యలన్నింటిని దృష్టిలో పెట్టుకొని, అర్చకులందరికీ సమాన వేతనం, ఉద్యోగ భద్రత, హెల్త్ కార్డులు, జీతాల నియమిత చెల్లింపు మరియు పదవీ విరమణ అనంతరం పెన్షన్ వంటి సదుపాయాలు కల్పించవలసిందిగా కోరుతూ దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కి మరియు కమిషనర్ కి మా వినతిని వినిపించుటకు ఈ రాష్ట్ర స్థాయి సమావేశం ఉద్దేశమని ఈ సమావేశానికి అందరూ విచ్చేసి విజయవంతం చేయవలసిందిగా కోరారు. ఈ సమావేశంలో గంగు ఉపేంద్ర శర్మ, మంగళగిరి తిరుపతాచార్యులు, రాజేశ్వరి శర్మ,రామశర్మ తదితరులు పాల్గొన్నారు.

# మీడియా సెల్ అధ్యక్షులు దేవిడ్ రాజు సేవలు అభినందనీయం: ఏఐసీసీ



**కల్లూరు, జనవరి 5 (పిసిడబ్ల్యూ న్యూస్) :**క్రైస్తవ సమాజ సంక్షేమ సంస్థ అసోసియేషన్ ఆఫ్ ఇండిపెండెంట్ క్రిస్టియన్ కమిటీ వారికి ప్రభుత్వానికి వారధిగా ఏఐసీసీ మీడియా సెల్ ఖమ్మం జిల్లా అధ్యక్షులుగా పాస్టర్ దాసరి డేవిడ్ రాజ్ అందిస్తున్న మీడియా పరమైన సేవలు ఎంతో అభినందనీయమని ఏఐసీసీ రాష్ట్ర అధ్యక్షులు రెవరెండ్ పి. ఏనోశ్ కుమార్, జిల్లా ఫైర్ సెల్ అధ్యక్షులు రెవరెండ్ టి. నిర్మల్ కుమార్ లు ముక్తకంఠంతో కితాబిచ్చారు. గడచిన అనేక సంవత్సరాలుగా ఏఐసీసీ రాష్ట్ర జిల్లా నియోజకవర్గ మండల కమిటీల ఆధ్వర్యంలో జరిగినటువంటి అనేక క్రైస్తవ సమాజ హిత కార్యక్రమాలను ఎంతో సామర్థ్యంతో మీడియా ద్వారా ప్రజలలోనికి ప్రభుత్వానికి చేరవేస్తూ ఏఐసీసీ రాష్ట్ర వ్యాప్తంగా బలపడడానికి మీడియా సెల్ అధ్యక్షులుగా పాస్టర్ దాసరి డేవిడ్ రాజు అందించిన సేవలు ఎంతో అభినందనీయమని సోమవారం పట్టణ కేంద్రంలోని టీజీఎం వర్షిప్ సెంటర్లో జరిగిన నియోజకవర్గ ఏఐసీసీ విస్తృతస్థాయి సమావేశంలో వారన్నారు. అనంతరం ఆయనను శాలువాతో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు. మరి భవిష్యత్తులో మరిన్ని సేవలు ఏఐసిసి అభివృద్ధికి అందించాలని, ఏఐసిసి లో మరెన్నో ఉన్నత పదవులు అలంకరించాలని వారు ఈ సందర్భంగా దీవించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ ప్రధాన కార్యదర్శి బ్రదర్ బాలరాజు, నియోజకవర్గ కమిటీ బాధ్యులు, మండల కమిటీ బాధ్యులు, నియోజకవర్గంలోని ఏఐసీసీ పాస్టర్లు పాల్గొన్నారు.

# రోడ్డు భద్రతా మాసోత్సవ ర్యాలీ: ట్రాఫిక్ నిబంధనల పట్ల విద్యార్థులకు అవగాహన





**చిట్యాల జనవరి 5 (పిసిడబ్ల్యూ న్యూస్):** చిట్యాల మండల కేంద్రంలో రోడ్డు భద్రతా మాసోత్సవాలలో భాగంగా రోడ్డు భద్రతా ర్యాలీ నిర్వహించారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల మరియు హైస్కూల్ విద్యార్థులతో కలిసి నిర్వహించిన ఈ కార్యక్రమంలో చిట్యాల ఎస్సై శ్రావణ్ కుమార్ తో కలిసి జిల్లా రవాణా అధికారి (ఋూ) మొహమ్మద్ సంధానీ ముఖ్య అతిథిగా పాల్గొని జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ రోడ్డు నిబంధనలను పాటించడం ద్వారా ప్రాణాపాయం నుండి తప్పించుకోవచ్చని సూచించారు. కొత్త నిబంధనలపై అవగాహన:సమావేశంలో డీటీవో సంధానీ గారు కీలక అంశాలపై అవగాహన కల్పించారు:హెల్మెట్ మరియు సీట్ బెల్ట్: ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా ఐఎస్ఐ ముద్ర ఉన్న హెల్మెట్ ధరించాలని, కార్లలో ప్రయాణించే వారు సీట్ బెల్ట్ పెట్టుకోవాలని సూచించారు. 18 ఏళ్ల లోపు పిల్లలు వాహనాలు నడపడం చట్టరీత్యా నేరమని, పిల్లలకు వాహనాలు ఇచ్చే తల్లిదండ్రులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మద్యం సేవించి వాహనం నడపడం:లి'డ్రంక్ అండ్ డ్రైవ్' ప్రాణాలకు ముప్పని, మద్యం మత్తులో వాహనం నడిపితే జైలు శిక్ష తప్పదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్, రవాణా శాఖ సుందర్ లాల్, శ్రీనివాస్ మరియు వందలాది మంది విద్యార్థులు పాల్గొన్నారు.

# కంటిచూపుకై సహకరించరూ...!

- ఆపన్న హస్తం కోసం ఎదురుచూపు..!

**ఖమ్మం ప్రతినిధి, జనవరి 5 (పిసిడబ్ల్యూ న్యూస్) :** పెయింటింగ్ పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకునే ఓ యువకుడికి ఆ పెయింటింగ్ కెమికల్స్ ప్రభావానికి రెండు కళ్ళు పోయిన ఘటన ఖమ్మం జిల్లా పాండురంగాపురంలో చోటు చేసుకుంది. ఖమ్మం నగరానికి ఆనుకుని ఉన్న పాండురంగాపురానికి చెందిన ఏర్పుల శ్రీకాంత్ అనే యువకుడు పెయింటింగ్ పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకునే వాడు. గత 20 ఏళ్లుగా ఆ వృతి మీదనే ఆధారపడి జీవిస్తున్నాడు. ఈ క్రమంలో గత మూడున్నర సంవత్సరాల క్రితం నుంచి కంటి చూపు మందగిస్తూ వస్తుందని, క్రమ క్రమంగా తగ్గిపోయి మూడు సంవత్సరాల క్రితం పూర్తిగా కంటి చూపు పోయిందని ఆవేదన వ్యక్తం చేశాడు. తల్లిదండ్రి లేకుండా అనాధగా పెరిగిన శ్రీకాంత్ వివాహం చేసుకున్న కొద్ది సంవత్సరాలకే కంటి చూపు కూడా పోవడంతో కుటుంబం వీధిన పడిందని స్థానికులు అంటూ అంటున్నారు. రెక్కడితేగాని డొక్కాడని పేదింటి పెయింటర్ కు 36 ఏళ్లకే కొండంత కష్టం వచ్చిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికీ ప్రైవేట్ ఆసుపత్రుల్లో 5 లక్షల వరకు ఖర్చు చేశామని, కేరళా వైద్యంతో కంటిచూపువచ్చే అవకాశం ఉన్నదని, దానికి 5 లక్షలకు పైన ఖర్చు అవుతుందని వైద్యులు తెలిపినట్లు చెప్పాడు. మానవతా వాదులు, దాతలు వైద్యం చేయించడానికి ఆర్థిక సహాయం అందించాలని కోరుతున్నాడు. సహాయం చేయాలనుకునే దాతలు 8019222023 నెంబర్ ను సంప్రదించాలని వేడుకున్నాడు.



# 'అందరివాడు'కు ఆత్మీయ సన్మానం



**- ఆర్యవైశ్య మహాసభ వేదికగా సేవా సంకల్పం**

**- టిడబ్ల్యూజెఎఫ్ జిల్లా అధ్యక్షుడు సంతోష్ చక్రవర్తికి ఘన సత్కారం**

**ఖమ్మం ప్రతినిధి, జనవరి 5 (పిసిడబ్ల్యూ న్యూస్) :** ఖమ్మం గుట్టల బజార్ లోని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవ్యాలయం ప్రాంగణంలో ఖమ్మం జిల్లా ఆర్యవైశ్య మహాసభ జిల్లా కార్యవర్గ సమావేశం, అధ్యక్షులు పసుమర్తి చంద్రరావు అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఆధ్యాత్మిక వాతావరణంలో జరిగిన ఈ సమావేశానికి జిల్లా నలుమూలల నుంచి ఆర్యవైశ్య సమాజానికి చెందిన నాయకులు, ప్రతినిధులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో తరలి రావడంతో సభకు విశేష ప్రాధాన్యత లభించింది. ఐక్యతే బలమనే భావన సమావేశమంతా ప్రతిధ్వనించింది. సమావేశంలో ఇటీవల ఎన్నికైన గ్రామపంచాయతీ ఆర్యవైశ్య చైర్మన్లు, వార్డు సభ్యులు, చాంబర్ ఆఫ్ కామర్స్, జూబ్లీ క్లబ్, వివిధ దేవాలయాల పాలకవర్గాలకు ఎన్నికైన ఆర్యవైశ్య ప్రతినిధులను వేదికపై ఘనంగా సత్కరించారు. బాధ్యతలు స్వీకరించిన ప్రతి ఒక్కరూ వ్యక్తిగత ప్రయోజనాలకంటే సమాజ హితానికే ప్రాధాన్యం ఇవ్వాలని, సమిష్టి కృషితోనే ఆర్యవైశ్య సమాజానికి గౌరవం పెరుగుతుందని వక్తలు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమానికి ప్రత్యేక అతిథిగా తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టిడబ్ల్యూజెఎఫ్ ఎ హెచ్-2843) ఖమ్మం జిల్లా అధ్యక్షుడు టి. సంతోష్ చక్రవర్తిను ఆహ్వానించి, ៖అందరివాడు៖ గా గుర్తింపు పొందిన ఆయనను సభ వేదికపై ఆత్మీయంగా పిలిచి ఘన సన్మానం చేశారు. నిష్పక్షపాత జర్నలిజంతో ప్రజా సమస్యలను నిరంతరం వెలుగులోకి తీసుకువస్తూ సమాజానికి స్వరంగా నిలుస్తున్న ఆయన సేవలను కొనియాడుతూ శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు. బాధ్యతాయుతమైన మీడియా ప్రజాస్వామ్యానికి పునాదిగా నిలుస్తుందని నాయకులు స్పష్టం చేశారు. అనంతరం ఆర్యవైశ్య మహాసభ భవిష్యత్ కార్యాచరణపై కీలక చర్చలు జరిపారు. సేవా కార్యక్రమాల విస్తరణ, యువతను సంఘ కార్యకలాపాల్లో భాగస్వామ్యం చేయడం, సాంస్కృతిక విలువల పరిరక్షణ, దేవాలయాల అభివృద్ధి వంటి అంశాలను ప్రాధాన్యంగా తీసుకుంటూ సమాజ శ్రేయస్సే లక్ష్యంగా ముందుకు సాగాలని తీర్మానించారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న మండలాల అధ్యక్షులు, కార్యవర్గ సభ్యులు, మహిళా విభాగం నాయకులు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొని సమావేశాన్ని విజయవంతం చేశారు.



# క్రీడాకారుల నైపుణ్యానికి ఢిల్లీ పబ్లిక్ స్కూల్ నైవేద్యం



**వందలాది మంది క్రీడాకారుల ప్రోత్సాహానికి డీపీఎస్ చైర్మన్ రవీందర్ రెడ్డి, ప్రిన్సిపాల్ రణధీర్ మద్దతు మరిచిపోలేనిది**



**ఖమ్మం ప్రతినిధి, అక్టోబర్ 5 (పిసిడబ్ల్యూ న్యూస్):**మెదడుకు పదును పెట్టే అద్భుతమైన క్రీడ చెస్. అంతర్లీనంగా దాగి ఉన్న క్రీడా ప్రతిభను వెలికితీసి, ఒక చిన్న ప్రోత్సాహంతోనే అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లగల శక్తి ఈ ఆటకు ఉంది. అలాంటి చెస్ క్రీడకు వేదికగా నిలిచి, తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న వందలాది మంది క్రీడాకారులను ఒకే చోటకు సమీకరించి ఖమ్మం నగరానికి క్రీడా ఖ్యాతిని తెచ్చిన ఘనత ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌దే అని క్రీడాభిమానులు కొనియాడుతున్నారు.ఖమ్మం నగరం ఇల్లందు



క్రాస్ రోడ్ సమీపంలోని హరిత గార్డెన్ వేదికగా నిర్వహించిన రాష్ట్రస్థాయి 'వీరా' చెస్ టోర్నమెంట్‌లో క్రీడాకారుల ఉత్సాహం, ఉల్లాసం ఆద్యంతం కనిపించింది. చిన్నారుల నుంచి అనుభవజ్ఞుల వరకు వందలాది మంది క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొని తమ నైపుణ్యాన్ని ప్రదర్శించారు. ఈ విజయవంతమైన టోర్నమెంట్‌కు ఢిల్లీ పబ్లిక్ స్కూల్ చైర్మన్ రవీందర్ రెడ్డి అందించిన ఆర్థిక, నిర్వాహక సహకారం కీలకంగా నిలిచింది. అలాగే పాఠశాల ప్రిన్సిపాల్ రణధీర్ ఇచ్చిన ప్రోత్సాహం కూడా క్రీడాకారులకు మరింత ఉత్సాహాన్ని నింపింది.'వీరా' చెస్ టోర్నమెంట్ డైరెక్టర్



తేజావత్ వీరన్న, అంతర్జాతీయ రేటెడ్ ప్లేయర్ మరియు ప్రొఫెషనల్ చెస్ కోచ్ పేదాడ శివకృష్ణ మాట్లాడుతూ, "క్రీడాకారులను ఛాంపియన్లుగా తీర్చిదిద్దాలంటే ఇలాంటి ప్రోత్సాహకులు ఎంతో అవసరం. ఢిల్లీ పబ్లిక్ స్కూల్ అందిస్తున్న మద్దతు క్రీడా రంగానికి దిశానిర్దేశం చేస్తోంది" అని ప్రశంసించారు.గెలుపొందిన క్రీడాకారుల ముఖాల్లో కనిపించిన ఆనందం, వారి కుటుంబాల్లో వెల్లివిరిసిన ఉత్సాహం వెనుక ఢిల్లీ పబ్లిక్ స్కూల్ ప్రోత్సాహమే ప్రధాన కారణమని చెప్పవచ్చు. విద్యతో పాటు క్రీడలకు సమాన ప్రాధాన్యం ఇస్తూ భవిష్యత్ ఛాంపియన్లను తీర్చిదిద్దుతున్న డీపీఎస్ ప్రయత్నాలు నిజంగా అభినందనీయం.

# సవాళ్లతో ఎంతకాలమీ మోసాలు !

ప్రభుత్వాలు నడపడమంటే సవాళ్లు విసురుకోవడంలా ఉంది. కృష్ణా,గోదావరి జలాలపై తెలంగాణలో రాజకీయం తారాస్థాయికి చేరింది. అసెంబ్లీలో ప్రభుత్వం పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇస్తే..దానిని బహిష్కరించి, అసెంబ్లీకి రాకుండాపోయిన బిఆర్ఎస్ ఆదివారం ఇచ్చిన పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఎవరి కోసం అన్నది చెప్పాలి. అసెంబ్లీలో చర్చించాల్సిన విషయంపై పార్టీ ఆఫీసులో కూర్చుని కాకమ్మ కబుర్లు చెప్పడం ఎవరిని మోసం చేయడానికి అన్నదే ప్రశ్న. అదే విషయం అసెంబ్లీలో ఎందుకు చెప్పలేక పోయారు. గత పదేళ్లలో చేసిన దుర్మార్గాలను కప్పిపుచ్చి, తెలంగాణ ప్రజలక చేసిన ద్రోహాన్ని మరచి పోయి, తెలంగాణను దోచుకుని అప్పులకుప్ప చేసిన బిఆర్ఎస్ ముందు..పదేళ్ల పాపాలపై చర్చించాలి. ప్రజలకు సమాధానం చెప్పాలి. తప్పులు చేయడం, అప్పులు చేయడం సవాళ్లు విసురుకోవడం అన్నది పరిపాటిగా మారింది. ఇది కాంగ్రెస్, బిఆర్ఎస్ పార్టీ వ్యవహారం కాదు. ఇది తెలంగాణ ప్రజల వ్యవహారం. ఇరు పార్టీలు సవాళ్లతో సాగడం వల్ల నష్టపోయేది ప్రజలు తప్ప వీరు కాదని గుర్తించాలి. ఉచిత పథకాలు, సంక్షేమం పేరుతో ఖజానాను లూటీ చేయడంలో ఇద్దరూ పోటీ పడ్డారు. అప్పుడు బిఆర్ఎస్, ఇప్పుడు కాంగ్రెస్ పోటీ పడుతూనే ఉంది. రాష్ట్రంలో కనీసం కొత్తగా రోడ్లు లేకున్నా దెబ్బతిన్న రోడ్డు వేయకుండా చోద్యం చూస్తున్నారు. కాళేశ్వరం, దరణి, ఫోన్ ట్యాపింట్ కేసుల్లో రెండేళ్లు గడిచినా గుండుసూది మొనంత కూడా ముందుకు సాగడం లేదు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికలకు ముందు ఆర్థిక పరిస్థితిపై అవగాహన లేకుండా హామీలు ఇచ్చి, ఇప్పుడు ఆ హామీలను అమలు చేయలేక దిక్కులు చూస్తోంది. దీంతో ప్రధాన ప్రతిపక్షమైన బీఆర్ఎస్ నాయకులు ప్రభుత్వంపై విరుచుకుపడుతున్నారు. అయితే, ఈ విషయంలో ఆ పార్టీని తప్పు పట్టాల్సింది కూడా లేదు. నాడు కేసీఆర్ అయినా, నేడు రేవంత్ రెడ్డి అయినా తమ సొంత ఆస్తులు అమ్మి పథకాలను అమలు చేయడం లేదు. అందుకే హామాలపైనా సవాళ్లు విసురుతున్నారు.ఈ ఇరువురు కూడా అప్పులు చేసి పథకాలను అమలు చేస్తున్న తీరు దారుణం కాక మరోటికాదు. జీతాలకు కూడా సక్రమంగా లేని దుస్థితికి తెలంగాణను తీసుకుని వచ్చారు.. అందుకే ప్రజలు కూడా గత కొన్నేళ్లుగా అమలవుతున్న పథకాలను తమ హక్కుగా భావిస్తున్నారు. ఉచిత పథకాలకు ప్రజలు బానిసలు కావడంతో వీరి ఆటలు సాగుతున్నాయి. అధికారం నిలబెట్టుకోవడమే లక్ష్యంగా సంక్షేమ పథకాలు అమలు చేసి ప్రజలను బురిడీ కొట్టిస్తున్నారు.ఎన్నికల రేసులో వెనుకబడి పోకూడదని రాజకీయ పార్టీలు పథకాల ప్రకటనలో పోటీ పడుతున్నాయి. తెలుగు రాష్ట్రాల్లో ఇది చూడవచ్చు. అప్పుల కారణంగా అవసరమైన మౌలిక వసతులు ఏమాత్రం మెరుగుపడ్డం లేదు. రోడ్ల పరిస్థితి అధ్వానంగా ఉంది. తెలంగాణకు అయినా, ఆంధ్రప్రదేశ్‌కు అయినా ఇంతకన్నా తలవంపు మరోటి ఉండదు. ప్రభుత్వ పాఠశాలల్లో మరుగుదొడ్ల నిర్మాణాలకు నిధులు ఉండవు. సంక్షేమ వసతి గృహాల మెస్ బిల్లులు కూడా సకాలంలో చెల్లించరు. దీంతో ఆహార నాణ్యత లోపిస్తోంది. ప్రభుత్వ ఆస్పత్రులలో సిబ్బంది కొరత ఉండనే ఉంది. అత్యవసరమైన మందులు ఉండవు. ఇలా చెప్పుకొంటూ పోతే లెక్కలేదు. ఇవన్నీ ఇప్పుడు అధికారం కోల్పోయిన బిఆర్ఎస్, వైకాపాలకు విమర్శల అస్త్రాలకుగా మారాయి. తాము అధికారంలో ఉన్నప్పుడు ఈ రంగాలను ఉద్దరించినట్లు మాట్లాడుతున్నారు. ప్రభుత్వం ఉద్యోగులకు చెల్లించాల్సిన బకాయిలు కూడా పేరుకుపోతున్నాయి. పదవీ విరమణ సందర్భంగా ఉద్యోగులకు చెల్లించాల్సిన మొత్తాలను చెల్లించలేక పదవీ విరమణ వయసు పెంచుతున్నారు. ఆంధ్రప్రదేశ్‌లో కూడా ఇవే పరిస్థితులు దాపురించాయి. సూపర్ సిక్స్ అమలు చేయడం లేదుని కూటమిపై మాజీ ముఖ్యమంత్రి జగన్‌రెడ్డి ఒత్తిడి తెస్తున్నారు. నిన్నటిదాకా జగన్‌రెడ్డి అప్పులు చేయడం, తాకట్టు పెట్టడం చేశారు. ఇప్పుడు చంద్రబాబు అదే పని చేస్తారు. అంతిమంగా మునిగిపోయేది రాష్ట్రమే. చంద్రబాబు





కంపెనీలుగానీ, జగన్‌రెడ్డి కంపెనీలుగానీ ఆ నష్టాలను భరించవు. ఈ ఇద్దరు తమ వ్యాపారాల నుంచి ప్రజలకు పంచరు. రెండు రాష్ట్రాల్లోనూ ప్రభుత్వాలు చెల్లించాల్సిన బకాయిలు లక్షల కోట్లకు చేరాయి. చిన్నా చితకా పనులు చేసిన వారు సకాలంలో బిల్లులు పొందలేక నలిగిపోతున్నారు. ఇప్పుడు బిల్లులు చెల్లించడానికి కూడా కమిషన్లు తీసుకోవడం ప్రారంభించారన్న విమర్శలు వస్తున్నాయి. ఒకరిద్దరు మంత్రులు అదేపనిగా వసూళ్ల దందాకు తెరలేపారని కేంద్రమంత్రి బండి సంజయ్ ఇటీవల ఆరోపించారు. వారిపై నిఘా పెట్టామన్నారు. సంక్షేమం పేరిట పంపకాలకు పాల్పడుతూ మరో వైపు అవినీతికి గేట్లు ఎత్తుతున్నారు. ఈ అవినీతి సొమ్ములో కొంత మొత్తాన్ని ఎన్నికల సమయంలో ప్రజలకు పంచుతున్నారు. రైతులకు ఉచిత విద్యుత్, ఫీజు రియంబర్స్‌మెంట్ చెల్లింపులు, ఆరోగ్యశ్రీ వంటి పథకాలు అమలు చేసినా ఫలితం దక్కడం లేదు. అన్ని సంక్షేమ పథకాలు అమలు చేసినా, బటన్లు నొక్కినా 2024 ఎన్నికల్లో జగన్‌రెడ్డికి 11 సీట్లు మాత్రమే వచ్చాయి. తెలంగాణలో కేసీఆర్‌ను గానీ, ఆంధప్రదేశ్‌లో జగన్‌రెడ్డిని గానీ సంక్షేమ పథకాలు కాపాడలేదు. ఈ వాస్తవాన్ని విస్మరించిన ఆంధ్రప్రదేశ్ ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు 2024లో 'సూపర్ సిక్స్' పేరిట సరికొత్త హామీలు ఇచ్చారు. వృద్దాప్య పెన్షన్ల మొత్తాన్ని ఏకంగా నాలుగు వేలకు పెంచారు. వాటిని పంచడానికి హెలికాప్టర్లు వేసుకుని ఊరేగుతున్నారు. కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెడుతున్నారని కాంగ్రెస్ పార్టీ ఆరోపించగా, ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పులపాలు చేస్తోందని బీఆర్ఎస్ విమర్శిస్తోంది. ఆంధప్రదేశ్‌లో కూడా నాడు జగన్మోహన్ రెడ్డి పది లక్షల కోట్లు అప్పులు చేశారని తెలుగుదేశం పార్టీ విమర్శించగా, ఇప్పుడు కూటమి ప్రభుత్వం చేస్తున్న అప్పులు చూసి జగన్ అండ్ కో గుండెలు బాదుకుంటున్నారు. ప్రభుత్వాలకు ఆదాయం ఇబ్బడి ముబ్బడిగా పెరిగి నిధులు మూలుగుతుంటే ప్రజలకు పంచి పెట్టడంలో తప్పు లేదు. కానీ అప్పులు చేసి పథకాలు అమలు చేయడం, చేయని వాటిపై సవాళ్లు విసరడం మామూలయ్యింది. సవాళ్ల ప్రజలను మభ్య పెట్టలేరు. ప్రజలు చైతన్యం అయితే తప్ప ఈ దుర్మార్గాల నుంచి బయటపడలేము.

# మరోమారు భారత్‌పై ట్రంప్ అక్కసు

**• మరిన్ని టారిఫ్‌లు విధిస్తానంటూ హెచ్చరికలు**



**వాషింగ్టన్,జనవరి5:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి భారత్‌ను టార్గెట్ చేశారు. రష్యాతో భారత్ స్నేహంగా ఉండటాన్ని.. మరీ ముఖ్యంగా చమురు దిగుమతి చేసుకోవటాన్ని ట్రంప్ జీర్ణించుకోలేకపోతున్నారు. ఎలాగైనా రష్యా నుంచి భారత్‌ను దూరం చేయాలని భావిస్తున్నారు. అధిక సుంకాలు విధిస్తామంటూ బెదిరింపులకు దిగుతున్నారు. ఇప్పటికే భారత్‌నుంచి అమెరికాకు దిగుమతి అవుతున్న చాలా వస్తువులపై 50 శాతం టారిఫ్‌లు విధించారు. భారత వ్యాపారాన్ని దెబ్బ తీసేలా దారుణంగా వ్యవహరిస్తున్నారు. మరోసారి భారత్, రష్యా వాణిజ్య ఒప్పందాలపై ఆయన ఫైర్ అయ్యారు. మేరకు వైట్ హౌస్.. అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు సంబంధించిన ఆడియోను సోమవారం మీడియాకు విడుదల చేసింది. ఆ ఆడియోలో ఏముందంటే..' అమెరికాతో భారత్ వాణిజ్య లావాదేవీలు కొనసాగిస్తోంది. భారత్ వాణిజ్య లావాదేవీలపై త్వరలో సుంకాలు పెంచుతా. భారత్ నన్ను సంతోషపెట్టాలని కోరుకుంటోంది. ప్రధాని మోదీ చాలా మంచి వ్యక్తి. నేను సంతోషంగా లేనని ప్రధాని మోదీకి తెలుసు. నన్ను సంతోషపెట్టడం భారత్‌కు చాలా ముఖ్యం' అని చెప్పుకొచ్చారు. కాగా, గతంలో భారత్‌పై అమెరికా 50 శాతం టారిఫ్‌లు విధించింది. ఇందులో 25 శాతం టారిఫ్‌లు కేవలం రష్యాతో ఆయిల్ దిగుమతి చేసుకుంటున్న కారణంగా విధించింది. డొనాల్డ్ ట్రంప్ చెబుతున్న దాని ప్రకారం అమెరికా అత్యధిక టారిఫ్‌లు వేసిన దేశాల్లో భారత్ ముందు వరుసలో ఉంది. రెండు దేశాల మధ్య సంబంధాలు దెబ్బతింటున్న నేపథ్యంలో బైలెటెరల్ ట్రేడ్ అగ్రిమెంట్స్ (బీటీఏ) చేసుకోవాలని ఇండియా చూస్తోంది. అతి త్వరలో ఇందుకు సంబంధించిన అప్‌డేట్ వచ్చే అవకాశం ఉంది.భారత్‌పై మరిన్ని టారిఫ్‌లు విధించనున్నట్లు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటించారు. రష్యా నుండి భారత్ చమురు కొనుగోళ్లు కొనసాగిస్తుండటంపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ.. భారత్‌పై టారిఫ్‌లను మరింత పెంచనున్నట్లు తెలిపారు. ఎ÷-లోరిడా నుండి వాషింగ్టన్ డిసికి వెళ్లే మార్గంలో ఎయిర్‌ఫోర్స్ వన్ విమానంలో ఆదివారం మీడియాతో మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. 'ప్రధాని మోడీ మంచి వ్యక్తి. నేను సంతోషంగా లేనని ఆయనకు తెలుసు. నన్ను సంతోషపెట్టడం ముఖ్యం. రష్యాతో వ్యాపారం కొనసాగిస్తే.. మేము మరిన్ని టారిఫ్‌లను విధిస్తాం' అని పేర్కొన్నారు. ట్రంప్ భారత్‌పై విధించిన టారిఫ్‌ల కారణంగానే భారత్ ఇప్పుడు రష్యన్ చమురు కొనుగోళ్లను గణనీయంగా తగ్గించిందని అమెరికా సెనెటర్ లిండ్సే గ్రాహం పేర్కొన్నారు. ఎయిర్‌ఫోర్స్ వన్‌లో ట్రంప్‌తో పాటు లిండ్సే గ్రాహం కూడా ఉన్నారు. రష్యన్ చమురు కొనుగోలు చేసే దేశాల దిగుమతులపై 500శాతం టారిఫ్‌లు విధించే టారిఫ్ బిల్లు గురించి గ్రాహం వెల్లడించారు. రష్యా-ఉక్రెయిన్ యుద్దాన్ని ముగించాలంటే, రష్యా భాగస్వామ్యులపై ఒత్తిడి తీసుకురావాలని గ్రాహం పేర్కొన్నారు. ఆంక్షలు రష్యాను తీవ్రంగా దెబ్బతీస్తాయని అన్నారు. రష్యా చమురును కొనుగోలు చేసినందుకే భారత్‌పై అమెరికా 25శాతం సుంకం విధించిందని అన్నారు.

# చెప్పినట్లు చేయకపోతే మదురోకు పట్టిన గతే పడుతుంది

**• వెనిజువెలా తాత్కాలిక అధ్యక్షురాలుకు ట్రంప్ హెచ్చరికలు**



**వాషింగ్టన్,జనవరి5:**వెనెజువెలా తాత్కాలిక అధ్యక్షురాలు డెల్సీ రోడ్రిగ్జ్‌పై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ గట్టి హెచ్చరికలు చేశారు. అగ్రరాజ్యం మాట వినకుంటే ఆమె భారీ మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని వార్నింగ్ ఇచ్చారు. ఓ మీడియా పత్రికకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేశారు. నికోలస్ మదురోను అమెరికా నిర్బంధించడంతో ఉపాధ్యక్షురాలిగా ఉన్న డెల్సీ రోడ్రిగ్జ్ తాత్కాలిక అధ్యక్షురాలిగా బాధ్యతలు చేపట్టిన సంగతి తెలిసిందే. ఆమె నియామకంపై ట్రంప్ స్పందిస్తూ.. వెనెజువెలాలో ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపర్చేందుకు అమెరికా చేయాలనుకుంటున్న పనులను చేసేందుకు డెల్సీ సుముఖంగా ఉందన్నారు. అయితే, తాత్కాలిక అధ్యక్షురాలిగా బాధ్యతలు చేపట్టిన అనంతరం ఆమె అమెరికా చర్యలను విమర్శించారు. మదురోను నిర్బంధించడం సరికాదని, ఆయనను వెంటనే వదిలేయాలని డిమాండ్ చేశారు.డెల్సీ స్పందనపై ట్రంప్ ఆగ్రహం వ్యక్తం చేశారు. 'దీన్ని మేం సహించబోం. ఆమె సరైన నిర్ణయాలు తీసుకోకపోతే మదురో కంటే ఘోరమైన గతి పడుతుంది. వెనెజువెలాపై మా నియంత్రణకు ఆమె అంగీకరించాల్సిందే. అప్పుడే ఆ దేశాన్ని మేం పునర్ నిర్మించగలం. మేం కోరుకున్నది ఆమె చేస్తే.. వెనెజువెలాలో మా బలగాలను మోహరించబోం అని ట్రంప్ హెచ్చరించారు. మరోవైపు వెనెజువెలాతో కలిసి పని చేసేందుకు అమెరికా ప్రభుత్వానికి డెల్సీ ఆహ్వానం పంపించారు. 'శాంతిస్థాపనకు మేం కట్టుబడి ఉన్నాం. వెలుపలి నుంచి ఎలాంటి ముప్పు లేకుండా అంతర్జాతీయ సహకారంతో గౌరవప్రదంగా జీవించాలని మా దేశం కోరుకుంటోంది. ప్రతి దేశంలో శాంతియుత పరిస్థితులు ఉన్నప్పుడే ప్రపంచశాంతి నెలకొంటుందని మేం విశ్వసిస్తున్నాం. అమెరికాతో పాటు అన్ని దేశాలతో మర్యాదపూర్వక, సమతుల్య సంబంధాలు నెలకొల్పడానికి మేం ప్రాధాన్యమిస్తాం. మా దేశ పురోగతి కోసం మాతో కలిసి పని చేసేందుకు అమెరికాను ఆహ్వానిస్తున్నాం' అని ఆమె తన సోషల్ మీడియాలో సుదీర్ఘ పోస్ట్ చేశారు.